# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 3-2-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:144 పేజీలు:6 వెల: రూ.1/-


**చురక**

అభివృద్ధి బడ్జెట్టని
అధినేతల మంత్ర జపం
అందరినీ ఊరించే
అది ఓట్ల మనోతపం.

సమాన్యుల సమస్యలు
చక్కదిద్దే చూపు నిల్లు
ఐతేనేమి అద్భుతంగా
ఐదేళ్లకు ప్రగతి స్టిల్లు.



-వేల్పుల నారాయణ
9440433475

## ఈ నెల 4న తెలంగాణ కేబినెట్ భేటీ.. బడ్జెట్ సమావేశాలపై చర్చ!

హైదరాబాద్, ఫిబ్రవరి 2:ఈ నెల 4వ తేదీన తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల నిర్వహణతో పాటు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లోని రెండు స్కీమ్‌ల అమలుపై ఈ భేటీలో చర్చించనున్నారు. ఈ సమావేశంలోనే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల నిర్వహణ తేదీని అధికారికంగా నిర్ణయించనున్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. 9వ తేదీన గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం చేయనున్నారు.

ఇక 10వ తేదీన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. 11వ తేదీ ఆదివారం సెలవుదినం వదిలేస్తే.. 12వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

# జార్ఖండ్ కొత్త సిఎం గా చంపయి సోరెన్ ప్రమాణ స్వీకారం



రాంచీ ఫిబ్రవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: జార్ఖండ్ ప్రభుత్వంలో ఏర్పడిన సందిగ్ధత ఎట్టకేలకు వీడింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా జేఎంఎం సీనియర్ నేత, మంత్రి చంపయి సోరెన్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజధాని రాంచీలోని రాజ్ భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఆయనతోపాటు కాంగ్రెస్ ఎమ్మెల్యే అలంగీర్ మంత్రిగా ప్రమాణం చేశారు.

**హేమంత్ అరెస్ట్ నుంచి చంపయి ప్రమాణం వరకు..**

జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ అధికార దుర్వినియోగానికి పాల్పడి రూ.600 కోట్ల భూకుంభకోణానికి పాల్పడి అక్రమంగా సంపాదించిన డబ్బును విదేశాలకు తరలించినట్లు ఈడీ ఆరోపించింది. ఈ క్రమంలో ఆయనపై కేసు నమోదు చేసింది. అరెస్టు తప్పదని తేలడంతో రాజ్ భవన్‌లో ఆయన రెండు రోజుల క్రితం రాజీనామా చేశారు. అక్కడే ఉన్న ఈడీ అధికారులు ఆయన్ని అరెస్టు చేశారు.తొలుత హైకోర్టును ఆశ్రయించిన హేమంత్.. తరువాత పిటిషన్‌ని వెనక్కి తీసుకుని సుప్రీం తలుపు తట్టారు. ఆయన పిటిషన్‌పై విచారించిన కోర్టు.. తీర్పు వెలువరించింది. ఈ అంశంపై హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది. దీంతో సోరెన్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలినట్లైంది. సోరెన్ అరెస్ట్ కాగానే జేఎంఎం, కాంగ్రెస్‌కు చెందిన 43 మంది ఎమ్మెల్యేలు తదుపరి సీఎంగా మంత్రి చంపయి సోరెన్‌కు మద్దతు తెలిపారు. శుక్రవారం గవర్నర్ సమక్షంలో సీఎం ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది

# స్వయం సహాయక సంఘాలకు పూర్వ వైభవం

**-రూ.60కోట్ల విలువైన బ్యాంకు లింకేజీ చెక్కులను సీఎం పంపిణీ**

**-ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలు ఆత్మగౌరవంతో బతకాలనేదే తమ ఆకాంక్ష**

**-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

ఆదిలాబాద్ ఫిబ్రవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):: స్వయం సహాహక సంఘాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు ఆదిలాబాద్‌లో పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. స్వయం సహాయక సంఘాలకు రూ.60కోట్ల విలువైన బాంకు లింకేజీ చెక్కులను సీఎం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ మీడియాతో మాట్లాడు తూ... మహిళలకు అండగా నిలిచేం దుకే ప్రభుత్వం.. ఉచిత బస్సు ప్రయా ణ సౌకర్యం కల్పించిందని తెలిపారు. త్వరలోనే ప్రియాంక గాంధీని పిలిచి రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభిస్తామని చెప్పా రు. ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలు ఆత్మగౌరవంతో బతకాలనేదే తమ ఆకాంక్ష అని చెప్పారు.

త్వరలోనే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని అన్నారు. స్కూళ్లు, హాస్టళ్ల విద్యార్థుల యూనిఫామ్ కుట్టుపని స్వయం సహాయక సంఘాలకే ఇచ్చేలా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అడ్డుకోవాలని కొందరు కుట్ర చేస్తున్నారని... అలాంటి వారు ఊర్లల్లోకి వస్తే తగిన బుద్ధి చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు.కాగా.. ఇంద్రవెల్లి స్మారక స్థూపం వద్ద సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ఇంద్రవెల్లి అమరుల స్మృతి వనం అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. ఇంద్రవెల్లి జనసంద్రంగా మారింది. తెలంగాణ పునర్ నిర్మాణ సభకు ప్రజలు భారీగా తరలి వచ్చారు. ఆదిలాబాద్ - మంచిర్యాల రూట్‌లో కిలోమీటర్ల మేర వాహనాలు బారులు దీరాయి. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



## కెస్లాపూర్‌లో సీఎం రేవంత్

**-నాగోబాకు గిరిజన సాంప్రదాయంలో పూజలు**

ఆదిలాబాద్, ఫిబ్రవరి 2: సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్ ఆదివాసీల ఇలవేల్పు నాగోబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఇన్‌చార్జి మంత్రి సీతక్క, చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి ఉన్నారు. నాగోబా ఆలయం కమిటీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సీఎం.. మెస్రం వంశీయులు, మహిళా సంఘాలతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు.

**13 కోట్లతో రహదారి నిర్మాణానికి శ్రీకారం..**

ముట్నూ ర్ నుండి కేశ్లాపూర్ కు 13 కోట్లతో రహదారి పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని అన్నారు. ఆదివాసీల సంస్కృతి గొప్పదని వారి సంస్కృతి సాంప్రదాయాలు పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి రోడ్ షో ద్వారా ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం వద్దకు వచ్చి నివాళులర్పించారు. తెలంగాణ పునర్నిర్మాణ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఇంద్రవెల్లి ఆదివాసి అమరవీరుల కుటుంబాలను కలుసుకొని వారికి పరిహారం అందించారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి.. మంత్రి పొన్నం



మెదక్, ఫిబ్రవరి 2: (నేటినిజం ప్రతినిధి):విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మెదక్ జిల్లా తుప్రాన్ రెసిడెన్షియల్ స్కూల్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. స్కూల్ లో ఉన్న సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తుప్రాన్ రెసిడెన్షియల్ స్కూల్ లో 640 మంది విద్యార్థులు చదువుతున్నారు.. పాఠశాల ఆవరణ శుభ్రంగా లేకపోవడం, విద్యార్థుల హాస్టల్ వసతి క్లాస్ రూం గదులు ఒకే రూంలో ఉండడంతో అధికారులను పిలిపించి మాట్లాడారు.. ఆర్డీవో జయ చందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దిన్, తహశిల్దార్ విజయలక్ష్మిలను పిలిపించి స్కూల్ సమస్యలపై ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

స్కూల్ లో వాటర్ ప్లాంట్ మరమత్తుల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా రూ.50వేలను పాఠశాల సిబ్బందికి అందించారు. స్కూల్ లో కాంపౌండ్ లేకపోవడంతో కుక్కలు వస్తున్నాయని సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.. విద్యార్థులు కొంత మంది చెట్ల కింద చదువుతుండడంపై ఆరాతీశారు. వెంటనే అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశంతో పాటు రెసిడెన్షియల్ స్కూల్స్ కమిషనర్ రమణబాబుతో, మెదక్ కలెక్టర్ రాజర్షి షా తో ఫోన్ లో మాట్లాడారు. స్కూల్ లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. స్కూల్ లో విద్యార్థులకు బెడ్స్ ఏర్పాటు చేయాలని ఆర్డీవోకి ఆదేశించారు. రెసిడెన్షియల్ స్కూల్లో ప్లే గ్రౌండ్ లో ఆట వస్తువులతో పాటు ఓపెన్ జిమ్, పాఠశాల ఆవరణ సానిటేషన్ పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దిన్ ను ఆదేశించారు.స్కూలుకు కాంపౌండ్ వాల్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ ను ఆదేశించారు.. డ్రింకింగ్ వాటర్ సౌకర్యంతో పాటు వాటర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణంపై మున్సిపల్ కమిషనర్ దృష్టి సాధించాలని మంత్రి ఆదేశించారు. స్కూల్లో ప్రతి తరగతి గది తిరుగుతూ విద్యార్థులతో ముచ్చటించారు. 10వ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నందున మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల సిబ్బంది సైతం విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి.. విద్యార్థులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ భోజనం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన సిబ్బందితో పాటు వాచ్ మెన్ లను సన్మానించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తుప్రాన్ ఆర్డీవో జయ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దిన్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కృషికి ప్రజల భాగస్వామ్యం తోడైతేనే పర్యావరణ సమతుల్యత సాధ్యం

**– అటవీ, పర్యావరణ, శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ**



రంగారెడ్డి ఫిబ్రవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రభుత్వ కృషికి ప్రజల భాగస్వామ్యం తోడైతేనే పర్యావరణ సమతుల్యత సాధ్యపడుతుందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా నెక్నంపూర్ సరస్సు వద్ద నిర్వహించిన 'చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం వేడుకలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడంతో పాటు, చిత్తడి నేలలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఎగ్జిబిషన్ స్టాళ్ళను మంత్రి పరిశీలించారు. విద్యార్థులను ఆసక్తిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మంత్రితో చేయి కలిపేందుకు ఉత్సాహం చూపారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ, చిత్తడి నేలల సంరక్షణకు అనుసరించాల్సిన విధానాల పై మంత్రి సురేఖ మాట్లాడారు. పూర్వకాలంలో కాలుష్యం ఉండేది కాదని, జనాభా పెరుగుతున్నది కొద్దీ ప్రజలు అవగాహన లేమితో బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తుంటంతో కాలుష్యం పెరుగుతున్నదన్నారు. నాడు రసాయనాల ప్రభావంలేని ఆహారాన్ని తిన్నవారు వయస్సు మీద పడినా ఆరోగ్యంగా ఉంటే, నేడు 30 ఏళ్ళు దాటితే చాలు బిపి, షుగర్, కాళ్ళ నొప్పులంటూ అనారోగ్యంబారిన పడుతున్నారని అన్నారు. ప్రజలు తమ ఇల్లు పరిశుభ్రంగా ఉంటే చాలనే దృక్పథంతో సామాజిక బాధ్యతను విస్మరిస్తూ పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. బాధ్యతారాహిత్యమైన ప్రవర్తనతో పరిసరాలు అపరిశుభ్రమై, పీల్చే గాలి, తినే తిండి, తాగే నీరు కలుషితమవుతున్నాయని అన్నారు. ప్లాస్టిక్ మానవాళి పట్ల శాపంగా మారిందని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల స్థానంలో పేపర్ బ్యాగులను వాడాలని ప్రజలకు మంత్రి పిలుపునిచ్చారు. మనం ఏదైనా కార్యాన్ని అంతఃకరణ శుద్ధితో ఆచరించినప్పుడే, ఇతరులకు చెప్తే ఆచరిస్తారని చెప్తూ ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ పరమహంస జీవితంలోని ఒక ఘట్టాన్ని ప్రస్తావించారు. పాఠశాలల ఉపాధ్యాయులు, యాజమాన్యాలు పర్యావరణ పరిరక్షణ దిశగా విద్యార్థులను ప్రోత్సాహించాలని సూచించారు. పర్యావరణ పరిక్షణలో కీలకమైన చిత్తడి నేలలను కలుషితాల బారి నుంచి రక్షించినప్పుడే మానవ మనుగడకు, ఇతర జీవరాశుల మనుగడకు అనుకూల వాతావరణం నెలకొని ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. రామ్ సర్ ఒప్పందం లో పేర్కొన్న ప్రమాణాలకు అనుగుణంగా భారతదేశంలో 74 వెట్ ల్యాండ్ స్పాట్స్ ఉండగా, తెలంగాణ ప్రస్తుతానికి అమీన్ పూర్ లో ఒక వెట్ ల్యాండ్ స్పాట్ ను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. టూరిస్టులు సేదతీరడానికి వెట్ ల్యాండ్ స్పాట్స్ చాలా ఆహ్లాదకరంగా ఉంటాయని, వీటిని టూరిస్ట్ డెస్టినేషన్ లుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అన్నారు. ప్రభుత్వ కార్యాచరణకు తోడు ప్రజల సహకారం తోడైతే చిత్తడి నేలల పరిరక్షణ మహాకార్యం విజయవంతమవుతుందని పిలుపునిచ్చారు. చిత్తడి నేలల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీమతి వాణి ప్రసాద్, తెలంగాణ స్టేట్ బయోడైవర్సిటి బోర్డ్ సెక్రటరీ కాళిచరణ్ ఎస్ ఖర్తడే, ఎం. సునీల, శిల్పా శర్మ తదితర అధికారులు పాల్గొన్నారు.

## వచ్చే వారం నుంచి రూ.29కే కిలో బియ్యాన్ని విక్రయించనున్న కేంద్రం

హైదరాబాద్ ఫిబ్రవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్)దేశంలో బియ్యం ధరలు పెరిగాయని ఆందోళన చెందుతున్న మధ్యతరగతి ప్రజలకు గుడ్ న్యూస్ వచ్చింది. ఎందుకంటే ఇకపై కేంద్ర ప్రభుత్వం వచ్చే వారం నుంచి రూ.29కే కిలో బియ్యాన్ని విక్రయించనున్నట్లు కేంద్రం తెలిపింది. ఆ వివరాలేంటో ఇప్పుడు చుద్దాం. బియ్యాన్ని వచ్చే వారం నుంచి రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.29కి కేంద్ర ప్రభుత్వం విక్రయించనుంది.ప్రతి శుక్రవారం బియ్యం నిల్వకు సంబంధించిన సమాచారం అందించాలని ఇప్పటికే వ్యాపారులకు సూచించారు. ధరల నియంత్రణలో భాగంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందని అధికారులు వెల్లడించారు. భారత్ రైస్ ఇ కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లలో కూడా విక్రయించనున్నట్లు తెలిపారు. భారత్ రైస్ ప్రస్తుతం 5, 10 కిలోల ప్యాకెట్లలో అందుబాటులో ఉంటుందని చెప్పారు.వివిధ రకాల ఎగుమతులపై పరిమితులు ఉన్నప్పటికీ గత ఏడాదిలో బియ్యం సహ రిటైల్ హోల్‌సేల్ ధరలు దాదాపు 15 శాతం పెరిగాయి. ధరలను నియంత్రించేందుకు, ప్రభుత్వం నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా , నేషనల్ కన్స్యూమర్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా , అలాగే సెంట్రల్ స్టోర్ల ద్వారా రెండు సహకార సంఘాల ద్వారా రిటైల్ మార్కెట్‌లో సబ్సిడీతో కూడిన 'భారత్ రైస్'ని ప్రారంభించింది.

**నేటి కందం- నేటికి అందం**

కోరి-యొలంపిక్ క్రీడలు
గారవమొప్పంగ శీతకాలము లోనన్
నేరుగ కమిటీ పెద్దలు
తీరుగ జరిపిరి జపాను దేశములోనన్

(3-2-1971 మొదటిసారి ఆసియాలోని జపాన్ లో శీతకాలపు ఒలంపిక్ ఆటలు జరిగిన రోజు)



-రాధశ్రీ
సెల్:9494481210

## విద్యుత్ వినియోగదారులకు కరెంట్ సమాచారం కావాలంటే...

హైదరాబాద్ ఫిబ్రవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: విద్యుత్ వినియోగదారులు మీటర్లకు ఫోన్ నంబర్‌ను లింక్ చేసుకోవాలని ఆ సంస్థ అధికారులు కీలక సూచనలు చేశారు. ఫోన్ నంబర్‌ను లింక్ చేసుకుంటే ఎప్పటి నుంచి ఎప్పటి వరకు కరెంట్ ఉంటుందో తెలుస్తుందని.. ఇందుకు సంబంధించి ఫోన్‌కు ఓ మెసేజ్ వస్తుందని తెలిపారు. బిల్లు వివరాలను కూడా మెసేజ్‌లో తెలుసుకోవచ్చని అన్నారు. ఫోన్ నంబర్‌ను లింక్ చేయడానికి వినియోగదారులు వైబ్‌సైట్‌లో చూడాలని విద్యుత్ అధికారులు తెలిపారు. కరెంట్ మీటర్ రీడర్ తీసుకునే వ్యక్తి వచ్చినప్పుడు.. ఫోన్ నంబర్ అతనికి ఇవ్వాలని విద్యుత్ అధికారులు సూచించారు.

## కొనే ప్రతి ఒక్క వస్తువు అది నకిలీదా కాదా అవగాహన కలిగి ఉండాలి

**– యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వినియోగదారుల అవగాహన కార్యక్రమం**

హైదరాబాద్ ఫిబ్రవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని అరూర డిగ్రీ మరియు పీజీ కళాశాలలో వినియోగదారుల అవగాహన కార్యక్రమం 2024 ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రీతి పాండ్యా మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రీతి పాండ్యా మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరు కూడా ఆన్ లైన్ మోసాలు, కల్తీ ఆహార పదార్థాలు మరియు మనం కొనే ప్రతి ఒక్క వస్తువు అది నకిలీదా లేదా ప్రామాణికమైనదా తెలుసుకునేలా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. యూత్ రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని జరిగేలా యూత్ రెడ్ క్రాస్ విభాగాన్ని ప్రోత్సహించి సైబర్ క్రైమ్ వంటి నేరాలు మీద విద్యార్థులకు సరైన అవగాహన కల్పిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యులు ఏవి రావు, యం. అనురాధ, యూత్ రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖ కన్వీనర్ వి. మణిదీప్ మరియు అరోరా డిగ్రీ మరియు పీజీ కళాశాల హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్ అర్జున్ రావు, సువర్ణ ఆరోరా డిగ్రీ మరియు పీజీ కళాశాల యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకున్న మంత్రి దామోదర రాజనర్సింహ



జగిత్యాల, ఫిబ్రవరి 2:ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి వారిని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ సతీసమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.ధర్మపురి నియోజకవర్గానికి సంబంధించి 100 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, నర్సింగ్ కాలేజీ మంజూరు, ఎంసీహెచ్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య సిబ్బంది నియామకం, ప్రస్తుత సీహెచ్‌సీలో శవ పంచనామ వంటి పలు సమస్యలను తన దృష్టికి వచ్చాయన్నారు. వాటన్నింటిని త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. అంతకుముందు అర్చకులు, ఆలయ సిబ్బంది మంత్రికి ఘన స్వాగతం పలికారు. మంత్రి వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

## రెజొనెన్స్ విద్యార్థినిలను అభినందించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం, ఫిబ్రవరి 2:(నేటినిజం ప్రతినిధి): దక్షిణ భారత బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో తృతీయ స్థానం కైవసం చేసుకున్న రెజొనెన్స్ శ్రీనగర్ విద్యార్థినిలను జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అభినందించారు.

స్థానిక శ్రీనగర్ కాలనీలో గల రెజొనెన్స్ స్కూల్ లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినిలు డి. శ్రీవల్లి, జి.గాయత్రి దక్షిణ భారత స్థాయిలో జరిగిన బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపించి సౌత్ ఇండియా వైజ్ఞానిక ప్రదర్శనలో తృతీయ స్థానం కైవసం చేసుకొని జాతీయ స్థాయి బాలల వైజ్ఞానిక ప్రదర్శనకు పోటీలో నిలచిన సందర్భంగా వారిని కలెక్టర్ ప్రతిభతో రాణించాలని తెలిపారు.

# సంపూర్ణ అవగాహనతో కీళ్ళ వాత సమస్యల కట్టడి !

## (“రుమటాయిడ్ ఆర్థరైటిస్ అవగాహన దినం” సందర్భంగా)

1858లో ఆల్ఫ్రెడ్ బి. గర్రోడ్ నామకరణం చేలిన “రుమటాయిడ్ ఆర్థరైటిస్” వ్యాధి నేడు ప్రపంచ దేశాల వృద్ధులను పట్టి పీడుస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా కీళ్ళవాత సమస్యలు దీర్ఘకాలం పాటు వృద్ధులను వేధిస్తునే ఉన్నాయి. క్రోనిక్ ఆటోఇమ్యూన్ వ్యాధిగా పేరొందిన రుమటాయిడ్ ఆర్థరైటిస్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి 2013 నుంచి ‘రుమటాయిడ్ పేషంట్స్ ఫౌండేషన్’ చొరవతో ప్రపంచ దేశాలు 02 ఫిబ్రవరిన “రుమటాయిడ్ ఆర్థరైటిస్ అవగాహన దినం” పాటించుట ఆనవాయితీగా మారింది. కీళ్ళవాత సమస్యలను త్వరగా నిర్థారించుకోవడం, సమర్థవంత నిర్వహణ, దీర్ఘకాలిక వైద్యం లాంటి అంశాలను ప్రజలకు అవగాహన పరచడానికి ఆ వేదిక ఉపయోగపడుతున్నది. అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉన్న వయోవృద్ధులు కీళ్ళ నొప్పుల సమస్యలతో ఏమీ చేయలేక జీవితాలను, సమయాన్ని వృధా చేసుకుంటున్నారు. మానసికంగా శారీరకంగా బలహీనపరుస్తున్న కీళ్ళవాత సమస్యలు రానున్న భవిష్యత్తులో వయోజనులకు పెద్ద అవరోధంగా నిలుస్తూ ఉండనుంది. జెనెటిక్స్, పర్యావరణం, హార్మోన్లు లాంటివి కీళ్ళ వాత రోగానికి కారణం అవుతున్నాయి. కీళ్ళవాత వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే గుండె, ఊపిరితిత్తులు, నాడీ మండల సమస్యలకు కూడా దారి తీస్తాయని గమనించాలి.

కీళ్ళవాత అవగాహన దినం-2024 నినాదం:

02 ఫిబ్రవరి 2024న నిర్వహించుకుంటున్న ‘రుమటాయిడ్ ఆర్థరైటిస్ దినం - 2024’ నినాదంగా లివింగ్ వెల్ విత్ ఆర్ఏ : ఎర్లీ డయగ్నాసిస్, ఎఫెక్టివ్ మేనేజ్‌మెంట్, అండ్ ఏ బ్రైట్ ఫ్యూచర్” అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. తొలి దశలో గుర్తించడంతో సమస్య పరిష్కారం సులభంగా దొరుకుతుంది. కీళ్ళవాత సమస్యలను గుర్తించిన వెంటనే వైద్య సలహాలు తీసుకుంటూ చికిత్సకు సహకరించాలి. కీళ్ళవాత వ్యాధి కట్టడికి ఆరోగ్యకర జీవనశైలి, వైద్యుల సూచనలు పాటించడం, కీళ్ళవాత రోగుల నుంచి అనుభవాలను రాబట్టుకోవడం లాంటివి ఆచరించాలి. కీళ్ళవాత వ్యాధికి ఆధునిక చికిత్సలు కూడా అందుబాటులోకి రావడంతో ఆధునిక వైద్య విధానాల సహాయంతో నయం కావడం సులభం అవుతున్నది.

కీళ్ళవాత వ్యాధి నిర్ధారణ, రోగ లక్షణాలు, చికిత్సలు:

రుమటాయిడ్ ఆర్థరైటిస్ వ్యాధి కారణంగా కీళ్ళ వాపులు, నొప్పులు, కీళ్ళ దృఢత్వం, అలసట, జ్వర, ఆకలి లేమి, కండరాల బలహీనతలు, కీళ్ళ వైకల్యం లాంటి లక్షణాలతో కదలడంలో ఇబ్బందులు, అంగ వైకల్య భావనలు, కీళ్ళ విధ్వంసాలు, కణజాల విధ్వంసాలు కూడా కలుగుతాయి. అసాధారణ వ్యాధినిరోధక స్పందనల కారణాలతో కీళ్ళ వాతం సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. కీళ్ళ వాత వ్యాధి నిర్ధారణకు రోగి మెడికల్ హిస్టరీ, భౌతిక పరీక్షలు, రక్త పరీక్షలు, ఎక్స్-రే, ఎంఆర్ఐ లాంటి పరీక్షలు నిర్వహిస్తారు. కీళ్ళవాత వాపులు, నొప్పులు, కీళ్ళ విధ్యంసాన్ని అదుపు చేసుకోవడం లాంటి వైద్య చర్యలు పాటించాలి. తొలి దశలో రోగ లక్షణాలను గమనిస్తూ వైద్య సలహాలు తీసుకుంటూ, పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగితే కీళ్ళవాత రోగానికి పరిష్కారం దొరుకుతుంది.

కీళ్ళవాత వ్యాధి సాధారణ ప్రజలకు పట్ల అవగాహన, రోగులకు అవగాహన కల్పించడం, త్వరగా వ్యాధి నిర్ధారణ చేసుకోవడం, కీళ్ళవాత సంబంధ చికిత్సలకు సంబంధించిన నిధులు కేటాయించడం నిరంతరం జరగాలి. ఆహారంలో పండ్లు, కూరగాయలు, చేపలు, ఆరోగ్యకర ఓమెగా-3తోనకూడిన కొవ్వులు లాంటివి తీసుకుంటూనే స్వల్ప వ్యాయామం/నడక/ఈత/బైకింగ్, బరువు తగ్గే విధంగా లావు తగ్గడం, విశ్రాంతి తీసుకోవడం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండడం, పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని కట్టడి చేసుకోవడం లాంటివి పాటించాలి. ఈ విషయాలన్నింటినీ గమనిస్తూ కీళ్ళవాత సమస్యలను శాశ్వతంగా పొలిమేరలు దాటిద్దాం, ఆరోగ్యకర వృద్ధుల ప్రేమలను ఆస్వాదిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# యూపీఎస్సీ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేసిన 1990 బ్యాచ్‌కి చెందిన ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారి శ్రీ సంజయ్ వర్మ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:1990 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారి శ్రీ సంజయ్ వర్మ యూపీఎస్సీ ప్రధాన భవనంలోని సెంట్రల్ హాల్‌లో ఈ మధ్యాహ్నం యూపీఎస్సీ సభ్యునిగా మరియు సీక్రసీ ప్రమాణ స్వీకారం చేశారు. యూపీఎస్సీ చైర్మన్ డాక్టర్ మనోజ్ సోనీ ఆయనతో ప్రమాణం చేయించారు.

శ్రీ సంజయ్ వర్మ 1990లో ఇండియన్ ఫారిన్ సర్వీస్‌లో చేరారు. ఆయన స్పెయిన్ మరియు అండోరా రాయబారి; ఇథియోపియా, జిబౌటి మరియు ఆఫ్రికన్ యూనియన్‌కు రాయబారి; కాన్సుల్ జనరల్, దుబాయ్; కౌన్సెలర్ (ఎకనామిక్ అండ్ కమర్షియల్), ఇండియన్ ఎంబసీ, బీజింగ్; ప్రతినిధి మరియు సలహాదారు (ప్రెస్, ఇన్ఫర్మేషన్ అండ్ కల్చర్), ఇండియన్ ఎంబసీ, ఖాట్మండు; సెకండ్ సెక్రటరీ (ప్రెస్ అండ్ పొలిటికల్), ఇండియన్ ఎంబసీ, మనీలా మరియు హాంకాంగ్‌లోని ఎకనామిక్ అండ్ కమర్షియల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు.

విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో ఈ అసైన్‌మెంట్‌లు ఉన్నాయి: చైనా డెస్క్; ప్రతినిధికి సహాయకుడు (ఓఎస్‌డి); జాయింట్ సెక్రటరీ (డిజి), ఎనర్జీ సెక్యూరిటీ మరియు చీఫ్ ఆఫ్ ప్రోటోకాల్.

ముంబైలోని విల్సన్ కాలేజీలో ఆయన చదువుకున్నారు. అనంతరం ముంబై విశ్వవిద్యాలయంలోని జై హింద్ కాలేజీ నుండి ఆర్థికశాస్త్రంలో పట్టభద్రుడయ్యారు. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుండి ఇంటర్నేషనల్ స్టడీస్‌లో మాస్టర్స్ పట్టా పొందారు. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ ఆఫ్ ఇండియా నుండి ఆయన ఇంటర్నేషనల్ స్టడీస్‌లో ఫెలోషిప్ పొందారు మరియు అంతకుముందు దొరాబ్జీ టాటా స్కాలర్‌షిప్ గ్రహీతగా ఉన్నారు.

విశ్వవిద్యాలయ స్థాయిలో ఆయన హాకీ ఆటగాడు. పఠనం, సంగీతం, ప్రసిద్ధ భారతీయ సంస్కృతి మరియు సినిమాలు ఆయన అభిరుచులు.

# పట్టభద్రులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

ఖమ్మం, ఫిబ్రవరి 2:(నేటినిజం ప్రతినిధి): కొనిజర్ల మండలంలోని ప్రతి పట్టభద్రుడు రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్క వినియోగించుకోవాలని అందుకోసం 1 నవంబర్ 2020 వరకు డిగ్రీ పూర్తి చేసిన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటర్ కార్డును నమోదు చేసుకోవాలని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు పరికపల్లి శ్రీనివాస్ అన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ...గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసినా పట్టభద్రులు కూడా మళ్ళీ తహశీల్దార్ కార్యాలయంలో కావాల్సిన పత్రాలు సమర్పించి ఓటర్ కార్డును నమోదు చేసుకోవాలని కోరారు. తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ త్వరలో రానున్న సందర్భంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న డిగ్రీ పట్టభద్రులు త్వరగా ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకుని, ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అలాగే ఓటు హక్కును అందరూ సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ ఓటర్ గా నమోదు చేసుకోవడానికి కావాల్సిన పత్రాలు ఆధార్ కార్డు, డిగ్రీ ప్రోవిషనల్ సర్టిఫికెట్ జీరాక్స్, ఓటర్ ఐడి జీరాక్స్, పాస్ ఫోటోతో అర్హులైన ప్రతి ఒక్కరు ఫిబ్రవరి 6 లోపు ఓటర్ గా నమోదు చేసుకోవాలని కోరారు.

# దుస్తులు/ వస్త్రాల ఎగుమతి కోసం రాష్ట్ర మరియు కేంద్ర పన్నులు మరియు లేవీల రాయితీ పథకం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం 2026 మార్చి 31 వరకు దుస్తులు/వస్త్రాలు మరియు మేడ్ అప్‌ల ఎగుమతి కోసం రాష్ట్ర మరియు కేంద్ర పన్నులు రాయితీ మరియు పన్నుల తగ్గింపు (ఆర్ ఓ ఎస్ సి టీ ఎల్) పథకాన్ని కొనసాగించడానికి ఆమోదించింది.

దీర్ఘకాలిక డెలివరీ కోసం ముందస్తుగా ఆర్డర్‌లు ఇవ్వగలిగే టెక్స్‌టైల్స్ రంగంలో ఈ ప్రతిపాదిత కాలవ్యవధి రెండు (2) సంవత్సరాలపాటు స్కీమ్‌ను కొనసాగించడం వలన దీర్ఘకాలిక వాణిజ్య ప్రణాళికకు అవసరమైన స్థిరమైన విధాన పాలన కొనసాగుతుంది.

ఆర్ ఓ ఎస్ సి టీ ఎల్ పన్నులు మరియు లెవీల భారాన్ని తొలగించడం అనే విధాన కొనసాగింపు వల్ల ప్రణాళికను మరియు స్థిరత్వాన్ని నిర్ధారిస్తుంది. “వస్తువులు ఎగుమతి చేయబడతాయి అంతే కానీ దేశీయ పన్నులు కాదు” అనే సూత్రబద్ధ విధానం స్థిర వ్యాపార ఆవరణాన్ని అందిస్తాయి.

కేంద్ర మంత్రివర్గం ఈ పథకానికి గతం లో 31.03.2020 నుంచి 31 మార్చి 2024 వరకు ఆమోదం తెలిపింది ఇప్పుడు ఆర్ ఓ ఎస్ సి టీ ఎల్ కొనసాగింపుకు మరోసారి ఆమోదం లభించింది. ప్రస్తుతం ఉన్న పొడిగింపు మార్చి 31, 2026 వరకు వుంటుంది, దీని ద్వారా వస్త్రాల రంగం లో ఎగుమతి పోటీతత్వాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది. ఇది దుస్తులు/గార్మెంట్స్ మరియు మేడ్ అప్స్ ఉత్పత్తుల జీరో-రేటెడ్ ఎగుమతి సూత్రాన్ని అవలంబిస్తుంది. ఆర్ ఓ ఎస్ సి టీ ఎల్ పరిధిలోకి రాని ఇతర వస్త్ర ఉత్పత్తులు (చాప్టర్ 61, 62 మరియు 63 మినహా) ఇతర ఉత్పత్తులతో పాటు ఆర్ ఓ డీ టీ ఈ పీ కింద ప్రయోజనాలను పొందేందుకు అర్హులు.

రాయితీ ద్వారా దుస్తులు/ గార్మెంట్స్ మరియు మేడ్-అప్‌ల ఎగుమతిపై డ్యూటీ డ్రాబ్యాక్ స్కీమ్‌తో పాటు రాష్ట్ర మరియు కేంద్ర పన్నులు మరియు లెవీలను భర్తీ చేయడం ఈ పథకం యొక్క లక్ష్యం. పన్నులు మరియు సుంకాలు ఎగుమతి చేయకూడదనే అంతర్జాతీయంగా ఆమోదయోగ్యమైన సూత్రం ఆధారంగాఎగుమతుల కోసం అంతర్జాతీయ మార్కెట్‌లో సమస్థాయి పోటీ ఆవరణాన్ని కల్పించేందుకు ఈ పథకం రూపొందించబడింది. అందువల్ల, ఇన్‌పుట్‌లపై పరోక్ష పన్నులు మాత్రమే కాకుండా, తిరిగి చెల్లించని ఇతర రాష్ట్ర మరియు కేంద్ర పన్నులు మరియు లెవీల పై కూడా రాయితీలు ఇవ్వబడతాయి లేదా తిరిగి చెల్లించబడతాయి.

రవాణా, సొంత విద్యుత్, వ్యవసాయ రంగం, మండి ట్యాక్స్, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, ఎగుమతి పత్రాలపై స్టాంప్ డ్యూటీ, ముడి ఉత్పత్తిలో ఉపయోగించే పురుగుమందులు, ఎరువులు మొదలైన ఇన్‌పుట్‌లపై చెల్లించే ఎంబెడెడ్ ఎస్ జి ఎస్ టి ఇంధనంపై రాష్ట్ర పన్నులు మరియు సుంకాల రాయితీలో వ్యాట్ పన్ను నమోదుకాని డీలర్ల నుండి పత్తి కొనుగోళ్లు, విద్యుత్ ఉత్పత్తిలో ఉపయోగించే బొగ్గు మరియు రవాణా రంగానికి ఇన్‌పుట్‌లపై రీబేట్లు ఇవ్వబడతాయి. రవాణాలో ఉపయోగించే ఇంధనంపై కేంద్ర పన్నులు మరియు సుంకాల రాయితీ, ముడి పత్తి ఉత్పత్తిలో ఉపయోగించే పురుగుమందులు, ఎరువులు మొదలైన ఇన్‌పుట్‌లపై చెల్లించిన సీ జీ ఎస్ టీ, నమోదుకాని డీలర్‌ల నుండి కొనుగోళ్లు, విద్యుత్ ఉత్పత్తిలో ఉపయోగించే బొగ్గు, రవాణా రంగానికి సంబంధించిన ఇన్‌పుట్‌లు మరియు పొందుపరిచిన సీ జీ ఎస్ టీ మరియు పరిహారం సెస్‌లువీటిలో ఉంటాయి.

ఆర్ ఓ ఎస్ సి టీ ఎల్ ఒక ముఖ్యమైన విధాన చొరవ మరియు వస్త్ర విలువ వ్యవస్థకు అదనపు విలువ జోడించిన మరియు శ్రమతో కూడుకున్న విభాగాలైన దుస్తులు మరియు మేడ్ అప్‌లలో భారతీయ ఎగుమతుల పోటీతత్వాన్ని పెంపొందించడానికి ఇది సహాయపడింది. అలాగే దీర్ఘకాల డెలివరీ కోసం ముందస్తుగా ఆర్డర్‌లు పొందే టెక్స్‌టైల్స్ రంగంలో రెండు (2) సంవత్సరాల పాటు ఈ పథకాన్ని కొనసాగించడం వలన దీర్ఘకాలిక వాణిజ్య ప్రణాళికకు అవసరమైన ఈ స్థిరమైన విధాన పాలన సహాయపడుతుంది

# ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా అవగాహన ర్యాలీ




అమరావతి, ఫిబ్రవరి 2:యస్.పి సిద్దార్థ్ కౌశిల్ ఆదేశాలపై పులివెందుల డి.యస్.పి వినోద్ కుమార్ ఉత్తర్వుల మేరకు, 35వ జాతీయ రోడ్డుభద్రతా వారోత్సవాల్లో భాగముగా శుక్రవారం ద్విచక్ర వాహనాల ర్యాలీని మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ర్యాలీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మెన్ వల్లెపు వరప్రసాద్, అర్బన్ యస్.ఐ హుస్సేన్ పాల్గొని ద్విచక్ర వాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.

బైకు రైడర్లతో కలసి పులివెందులటౌన్ లోని కోర్ట్ సర్కిల్ నుండి పూలఅంగల్ల సర్కిల్ వరకు బైకుర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ఇంటి నుండి బయటకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించక పోవడమువలన, కారు డ్రైవర్లు షీట్ బెల్ట్ పెట్టుకోక పోవడమువల్ల రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ శాతము ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని గుర్తు చేసారు. దేశములో ప్రతిరోజు 28 మంది చొప్పున రోడ్డు ప్రమాదములో హెల్మెంట్ పెట్టక పోవడమువలనే ప్రాణాన్ని కోల్పోతున్నారని అన్నారు. కావున ప్రతిఒక ద్విచక్ర వాహనదారులు హెల్మెంట్, వాహనదారులు సీట్ బెల్ట్ ధరించి ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రయాణించాలన్నారు. త్రిబుల్ రైడింగ్, పరిమితికి మించి వాహనాలు నడుపుట, మద్యం సేవించి వాహనాలు నడుపుట వంటి చట్ట వ్యతిరేక పనులకు దూరముగా ఉండవలెనని సూచించారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా వారిలో చైతన్యము నింపుటకు ద్విచక్రర్యాలీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. రూల్స్ కు అతిక్రమించి వెళితే జరిమానా తప్పదన్నారు. ఈ ర్యాలీలో జేసిఎస్ ఇంచార్జ్ కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ కు సుప్రీంకోర్టు షాక్

## -పిటిషన్‌ను కొట్టివేస్తూ కోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ ఫిబ్రవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మనీలాండరింగ్ కేసులో తన అరెస్టును సవాలు చేసిన జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ కు సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. ఆయన పిటిషన్‌ను కొట్టివేస్తూ శుక్రవారం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగా ఈ అంశంలో తాము జోక్యం చేసుకోలేమని, హైకోర్టుకు వెళ్లాలని సూచించింది. మనీలాండరింగ్ కేసులో ఈడీ శుక్రవారం మధ్యాహ్నం ఆయన్ని అరెస్ట్ చేసింది.

### కేసు నేపథ్యం ఇదీ..

జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ అధికార దుర్వినియోగానికి పాల్పడి రూ.600 కోట్ల భూకుంభకోణానికి పాల్పడి అక్రమంగా సంపాదించిన డబ్బును విదేశాలకు తరలించినట్లు ఈడీ ఆరోపించింది. ఈ క్రమంలో ఆయనపై కేసు నమోదు చేసింది. అరెస్టు తప్పదని తేలడంతో రాజ్ భవన్‌లో ఆయన రెండు రోజుల క్రితం రాజీనామా చేశారు. అక్కడే ఉన్న ఈడీ అధికారులు ఆయన్ని అరెస్టు చేశారు. తొలుత హైకోర్టును ఆశ్రయించిన హేమంత్.. తరువాత పిటిషన్‌ని వెనక్కి తీసుకుని సుప్రీం తలుపు తట్టారు. ఆయ న పిటిషన్‌పై విచారించిన కోర్టు.. తీర్పు వెలువరించింది. ఈ అంశంపై హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది. దీంతో సోరెన్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలినట్లైంది. ఇప్పటికే జేఎంఎం, కాంగ్రెస్‌కు చెందిన 43 మంది ఎమ్మెల్యేలు తమ తదుపరి సీఎంగా మంత్రి చంపయి సోరెన్‌కు మద్దతు తెలిపారు. శుక్రవారం గవర్నర్ సమక్షంలో సీఎం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది.

# అసమర్థులకు పదవులు ఇచ్చి కేసీఆర్ ముస్లింలను ఇబ్బంది పెట్టారు

## - పార్టీ విధేయులను ఉపేక్షించొద్దు: ఏఐసీసీ నేతలకు ఎస్‌జెడ్ సయీద్ విజ్ఞప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 2, (ఎక్స్ ప్రెస్ న్యూ స్); కాంగ్రెస్ పార్టీ కేంద్ర నాయకులు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణు గోపాల్, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీ చంద్‌రెడ్డితో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ మైనారిటీస్ డిపార్ట్‌మెంట్ నేషనల్ కో-ఆర్డినేటర్ ఎస్‌జెడ్ సయీద్ సమావేశమైనారు. తెలంగాణలో మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారి దృష్టికి తీసుకువెళ్లారు. మరియు గత పదేళ్లలో ముస్లింలు కేవలం వాగ్దానాలకు మాత్రమే కట్టుబడి ఉన్నారని చెప్పారు. వాటిని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు జరిగాయన్నారు. ముస్లిం మైనార్టీల సంస్థలను కేసీఆర్ కీలుబొమ్మలుగా పెట్టి ముస్లింలను అపహాస్యం చేశారని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా వేణు గోపాల్, వంశీ చంద్‌రెడ్డి మాట్లాడుతూ ముస్లింల విద్యా, నైతిక ప్రమాణాలు ప్రతి చోటా అధమ స్థాయికి దిగజారిపోయాయని నేతలు దుయ్యబట్టారు. ముస్లింలలో విద్యావంతులు, తెలివితేటలున్న వ్యక్తి మంత్రివర్గంలోగానీ, ఇతర పదవుల్లోగానీ లేరా? కృతజ్ఞతగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది మరియు అన్ని బోర్డులను రద్దు చేసి ముస్లింలను ఈ నాయకుల నుండి విముక్తి చేసిందన్నారు. అనంతరం ఎస్‌జెడ్ సయీద్‌ఇప్పుడు బోర్డులు పెట్టినప్పుడల్లా అసమర్థులను, కీలుబొమ్మలను నామినేట్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్‌లో చేరిన టీఆర్ఎస్ నాయకులకు ‘పార్టీలోకి స్వాగతం’ ఉన్నప్పటికీ ప్రభుత్వ పదవుల్లో నియామకంలో పాత, విధేయులైన కార్యకర్తలను విస్మరించరాదన్నారు. దీంతో పాత కార్మికుల గుండె పగిలిపోతుంది. వక్ఫ్‌బోర్డు, హజ్ కమిటీ సమస్యలకు పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసారు.



# 10 రోజుల్లో అయోధ్య శ్రీ రాముడికి రూ.11 కోట్లకుపైగా విరాళాలు

## - తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయంతో పోటీ పడుతున్నశ్రీ రాముడు

అయోధ్య ఫిబ్రవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రాములవారి గుడికి రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయంతో శ్రీ రాముడు పోటీ పడుతున్నాడని భక్తులు అంటున్నారు. జనవరి 22న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాములవారి ప్రాణ ప్రతిష్ఠ జరగ్గా.. గడిచిన 10 రోజుల్లో వచ్చిన ఆదాయం రికార్డు నెలకొల్పింది. గత నెల 22 నుంచి ఫిబ్రవరి 1 వరకు 25 లక్షల మంది భక్తులు రామచంద్రుడిని దర్శించుకున్నట్లు అయోధ్య రామ జన్మ భూమి ట్రస్ట్ తెలిపింది.

ఆలయానికి ఇప్పటివరకు రూ.11 కోట్లకుపైగా విరాళాలు సమకూరాయని ట్రస్ట్ వెల్లడించింది. హుండీల్లో రూ.8 కోట్లు, చెక్కులు, ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా రూ.3 కోట్ల 50 లక్షలు విరాళాలు వచ్చాయన్నారు. దేవాలయ ప్రాంగణంలో భక్తులు కానుకలు ఇచ్చేందుకు 4 హుండీలను ఏర్పాటు చేశారు.

నడకమార్గంలో వీటిని ఏర్పాటు చేశారు. ఇవే కాకుండా డిజిటల్ విరాళాలు అందించేందుకు 10 కంప్యూటరైజ్డ్ కౌంటర్లు ఉన్నాయి. చెక్కులు, ఇతర ఆన్‌లైన్ చెల్లింపు పద్ధతుల ద్వారా కానుకలు సమర్పించవచ్చు.

11 మంది బ్యాంకు ఉద్యోగులు, ముగ్గురు ఆలయ ట్రస్టు సిబ్బందితో సహా 14 మంది హుండీ కానుకలు లెక్కించారు. ఈ ప్రక్రియ పటిష్ట భద్రత మధ్య జరిగింది. చలిగాలులు తగ్గడంతో అయోధ్యకు రాబోయే భక్తుల సంఖ్య మరింతగా ఉంటుందని తద్వారా వచ్చే ఆదాయం కూడా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగినట్లు ఏర్పాట్లు చేస్తున్నారు.

### నాన్‌స్టాప్ విమాన సేవలు..

యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా కలిసి ఇటీవల స్పైస్ జెట్ విమాన సేవల్ని ప్రారంభించారు. దర్భంగా, అహ్మదాబాద్, చెన్నై, జైపూర్, పట్నా, ఢిల్లీ, ముంబయి, బెంగళూరు నుంచి అయోధ్యకు వచ్చే భక్తులకు స్పైస్ జెట్ నాన్ స్టాప్ సేవల్ని అందించనుంది.

# వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రికి జాతీయ స్థాయిలో గుర్తింపు.. ఎన్‌క్వాస్ సర్టిఫికేట్ అందజేత

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 2:(నేటినిజం ప్రతినిధి): రోగులకు మెరుగైన వైద సేవలు అందించడంతో పాటు నిర్వహణలోనూ పనితనాన్ని కనబరుస్తున్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రికి కేంద్ర ప్రభుత్వం ఎన్‌క్వాస్ నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ సర్టిఫికేట్‌ను అందించింది. కేంద్ర బృందంగత సంవత్సరం అక్టోబర్‌లో వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించింది.

ఆస్పత్రిలో ఫార్మసీ , ఓపీడీ, అడ్మిన్, రేడియాలజీ, ఎమర్జెన్సీ, ఆక్సిలరీ సర్వీసెస్, ఐపీడీ, ఓటీ, ల్యాబ్, మెటర్నిటీ వార్డ్ లలో అందిస్తున్న సేవలకు గానూ ఎన్‌క్వాస్ సర్టిఫికేషన్, లేబర్ రూమ్ మెరుగైన నిర్వహణకు గానూ లక్ష్య ప్రోగ్రామ్ లో భాగంగా సర్టిఫికేషన్‌ను, పిడియాట్రిక్ విభాగంలో ముస్కాన్ సర్టిఫికేషన్ ను అందజేశారు.

వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి ఎన్‌క్వాస్ గుర్తింపు పొందినందుకు గానూ జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో వైద్య ప్రమాణాలు మెరుగయ్యాయని చెప్పడానికి మరో నిదర్శనమిదేనని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు నాణ్యమైన, అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇందుకు కృషి చేసిన వైద్య సిబ్బందికి జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు.

# 2009 మే నెలనుండి 2015 నవంబరు మధ్య కాలానికి గాను ఎరువు (యూరియా) యూనిట్ లకు దేశీయం గా గ్యాసును సరఫరా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:ఎరువు (యూరియా) యూనిట్ లకు 2009 వ సంవత్సరం మే నెల ఒకటో తేదీ మొదలుకొని 2015 నవంబరు 17 వ తేదీ వరకు ఉన్న కాలాని కి గాను దేశీయ గ్యాసు ను సరఫరా చేయడానికి సంబంధించి మార్కెటింగ్ మార్జిన్ నిర్ధారణ కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత న సమావేశమైన కేంద్ర మంత్రిమండలి తన ఆమోదాన్ని తెలిపింది.

ఈ ఆమోదం ఒక నిర్మాణాత్మకమైనటువంటి సంస్కరణ అని చెప్పాలి. గ్యాసు ను మార్కెటింగ్ చేయడం తో జత పడి ఉన్నటువంటి అదనపు నష్ట భయం మరియు వ్యయాల ను భరించడం కోసం ఈ మార్కెటింగ్ మార్జిన్ ను గ్యాస్ ధర కంటే కొంత ఎక్కువ గా వినియోగదారు ల వద్ద నుండి గ్యాస్ మార్కెటింగ్ కంపెనీ వసూలు చేస్తుంది. ప్రభుత్వం ఇంతకు ముందు 2015 వ సంవత్సరం లో యూరియా మరియు ఎల్‌పిజి ఉత్పత్తిదారు సంస్థలకు దేశీయ గ్యాసు సరఫరా చేయడానికి సంబంధించినటువంటి మార్కెటింగ్ మార్జిను ను నిర్ణయించింది.

# “చంపేస్తామంటూ” సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు

## - సైబరాబాద్ సైబర్ క్రైమ్ వైఎస్ పోలీసులకు సునీత ఫిర్యాదు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య అనంతరం న్యాయం కోసం కుమార్తె వైఎస్ సునీత చేస్తున్న పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. తండ్రిని చంపిన వారిని కఠినంగా శిక్షించాలంటూ హైకోర్టు, సుప్రీం కోర్టుల చుట్టూ సునీత తిరుగుతున్నారు. వైఎస్ వివేకా హత్య జరిగిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో బెదిరింపులు వచ్చినప్పటికీ సునీత వెనక్కి తగ్గలేదు. ఇటీవల తన సోదరి వైఎస్ షర్మిలను సునీత కలవడం, ఆమెతో పాటు ఇడుపులపాయకు వెళ్లడం ఏపీ రాజకీయాల్లో నంచలనంగా మారింది. ఇప్పుడు అసలు విషయం ఏంటంటే.. “చంపేస్తామంటూ” సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారంటూ సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు సునీత ఫిర్యాదు చేశారు. ఫేస్‌బుక్‌లో అసభ్యకరమైన పోస్టులతో పాటు తనను, వైఎస్ షర్మిలను “లేపేస్తాం” అనే విధంగా బెదిరిస్తూ పోస్టులు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఫిర్యాదులోని పలు అంశాలు ఇవే..“నా కుటుంబ సభ్యులు రాజకీయాల్లో ఉన్నప్పటికీ నేను నా వ్యక్తిగత జీవితాన్ని గడుపుతున్నాను. గత కొన్ని రోజులుగా వర్రా రవీంద్రారెడ్డి అనే వ్యక్తి తన ఫేస్‌బుక్ పేజీలో నా పైన, నా సోదరి షర్మిలపైన అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నాడు. తీవ్ర అభ్యంతరకరమైన, అసహ్యకరమైన రీతిలో పోస్టులు ఉంటున్నాయి. వర్రా రవీంద్రారెడ్డి ఫేస్‌బుక్ పేజీలో మొత్తం షర్మిల, నాపై అనేక అవమానకరమైన పోస్టులు ఉన్నాయి.

వర్రా రవీంద్ర రెడ్డి పరిధి దాటి పోస్టులు పెడుతున్నాడు. వర్రా రవీంద్ర రెడ్డి పెట్టే పోస్టులు మా ప్రతిష్టను దిగజార్చే విధంగా ఉన్నాయి. జనవరి 29న నా సోదరి షర్మిలతో పాటు నేను ఇడుపులపాయ వెళ్లాను. అనంతరం వర్రా రవీందర్ రెడ్డి తన పేజీలో నన్ను చంపేయాలి అని అర్థం వచ్చేట్టు ఒక పోస్ట్ పెట్టాడు. “అందుకే పెద్దలు అన్నారు శత్రు శేషం ఉండకూడదు లేపేయ్ అన్నాయ్ ఇద్దరినీ ఈ ఎన్నికలకు పనికి వస్తారు” అని ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టాడు. నా స్నేహితులు నాకు ఫేస్‌బుక్ లింక్ పంపారు. రవీందర్ రెడ్డి ఫేస్‌బుక్ పోస్టులు భయాందోళనకు గురిచేస్తున్నాయి. నా తండ్రి వివేకానంద రెడ్డి హత్య జరిగినప్పటి నుంచి పోరాటం చేస్తున్నాను. నాకు ప్రాణహాని ఉందని పోలీసులకు, సీబీఐ కూడా ఫిర్యాదు చేశాను. రవీందర్ రెడ్డి ఫేస్‌బుక్ పేజీలో మొత్తం నన్ను షర్మిలను, వైఎస్ విజయమ్మను కించపరుస్తూ పోస్టులు ఉన్నాయి. చంపేస్తామంటూ బెదిరింపులకు గురి చేసేలా పోస్టులు పెట్టే వారిపై తగిన చర్యలు తీసుకోండి” అంటూ వైఎస్ సునీత తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

# హర్కార వేణుగోపాలరావుకు బీసీ కమిషన్ చైర్మన్ అభినందనలు

హైదరాబాద్ ఫిబ్రవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్)గురువారం అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రోటోకాల్ మరియు పబ్లిక్ రిలేషన్స్ సలహాదారుడుగా పదవీ బాధ్యతలు చేపట్టిన హర్కార వేణుగోపాలరావుని అభినందిస్తూ పుష్పగుచ్చం అందజేస్తున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు.

# కృష్ణా బోర్డుకే ప్రాజెక్టుల నిర్వాహణ ..

## -ఒప్పుకున్న తెలుగు రాష్ట్రాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):: శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నిర్వాహణను కృష్ణా బోర్డుకు అప్పగించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలు అంగీకారం తెలిపాయి. గురువారం ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగింతపై జలసౌధలో కేఆర్ఎంబీ సమావేశం జరిగింది. కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ఈ నెల 17న ఢిల్లీలో జరిగిన సమావేశానికి కొనసాగింపుగా ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రాజెక్టుల నిర్వాహణను కృష్ణా బోర్డుకు అప్పగించేందుకు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు అంగీకరించాయి. అలాగే నీటి వాటాల పంపకం కోసం త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. దీంతో వాటాల కేటాయింపుపై త్రిసభ్య కమిటీనే తుది నిర్ణయం తీసుకోనుంది.

మాకు అభ్యంతరం లేదు: ఏపీ ఈఎన్సీ

బోర్డు పరిధిలో మొత్తం 15 ఓటిన్‌లలో 9 తెలంగాణ, 6 ఆంధ్రప్రదేశ్‌వి ఉన్నాయని ఏపీ ఈఎన్సీ నారాయణ రెడ్డి తెలిపారు. కృష్ణా బోర్డుకు ప్రాజెక్టుల అప్పగింతపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఆపరేషనల్ కోసం ఇరు రాష్ట్రాల నుంచి స్టాఫ్ కేటాయింపు ఉంటుందని.. వాటర్ కేటాయింపులపై త్రిసభ్య కమిటీ దే తుది నిర్ణయమని తెలిపారు. ప్రాజెక్టుల ఆపరేషనల్ ప్రోటోకాల్ త్రిసభ్య కమిటీ అప్పుడున్న పరిస్థితుల్లో తీసుకుంటారన్నారు. లెఫ్ట్ మెన్ కెనాల్ నుంచి 2 టీఎంసీ, మార్చ్‌లో రైట్ మెన్ కెనాల్ నుంచి 3 టీఎంసీ ఏపీకి విడుదలకు ఒప్పుకున్నారన్నారు. ఏప్రిల్‌లో 5 టీఎంసీలు ఏపీకి ముందుగానే ఉన్నాయన్నారు. ప్రాజెక్టుల ఆపరేషనల్ కోసం తెలంగాణ ఒప్పుకుందని తెలిపారు.

పూర్తిగా అప్పగించలేదు.. కేవలం: తెలంగాణ ఈఎన్సీ

ప్రాజెక్టుల ఆపరేటింగ్ అంతా కేఆర్ఎంబీకి ఇవ్వడం జరిగిందని తెలంగాణ ఈఎన్సీ మురళీధర్ అన్నారు. పవర్ స్టేషన్స్‌పై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. నాగార్జున సాగర్ తెలంగాణ, శ్రీశైలం ఏపీ చూసుకుంటుందని చెప్పారు. ప్రాజెక్టులన్నీ ఇక నుంచి బోర్డు పరిధిలో నడుస్తాయన్నారు. తమ డిమాండ్స్ అన్నీ కేంద్రానికి లేఖలు రాసామని.. ఇంకా అక్కడ నుంచి నిర్ణయం రాలేదన్నారు. నీటి వాటాల పంపకంపై త్రిసభ్య కమిటీనే నిర్ణయం తీసుకుంటుందన్నారు. ప్రాజెక్టుల వద్ద భద్రత అనేది పరిస్థితిని భట్టి బోర్డు కనుసన్నల్లో జరుగుతుందని చెప్పుకొచ్చారు. కేఆర్ఎంబీ పరిధిలో ఉన్న 15 ప్రాజెక్టులన్నీ బోర్డు పరిధిలోకి వెళ్తాయన్నారు. ప్రాజెక్టులను పూర్తిగా అప్పగించలేదని... ఆపరేషనల్, నీటి విడుదల బోర్డు చూసుకుంటుందని తెలిపారు. సీఆర్‌పీఎఫ్ కూడా కృష్ణా బోర్డు పరిధిలోనే ఉంటాయన్నారు. నిర్వహణ కోసం స్టాఫ్ కేటాయింపు 40 : 45 కావాలని అడుగుతున్నారని వెల్లడించారు.

# ఎలక్ట్రిక్ వాహనాల (ఇవి) పర్యావరణాన్ని బలోపేతం చేసేందుకు ప్రతిష్ఠాత్మక ప్రణాళికను ప్రకటించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:నిలకడైన రవాణా దిశగా పరివర్తనాత్మక చర్యగా కేంద్ర ఆర్థిక ఉ కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ గురువారం నాడు పార్లమెంటులో మధ్యంతర బడ్జెట్ 2024-15ను ప్రవేశపెడుతూ ఎలక్ట్రిక్ వాహనాల (ఇవి)ల పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేసే ప్రతిష్ఠాత్మక ప్రణాళికను ప్రకటించారు. ఎలక్ట్రిక్ వాహనాల పరిదృశ్యాన్ని విస్తృతం చేసి, బలోపేతం చేసే లక్ష్యంతో తయారీ, చార్జింగ్ మౌలిక సదుపాయాలు రెంటిపై ఈ వ్యూహాత్మక చొరవ దృష్టిపెడుతుంది.

ప్రజా రవాణాను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి పెడుతూ, ఎలక్ట్రిక్ బస్సుల విస్తృత రూపాంతరణాన్ని ప్రభుత్వం ప్రోత్సహించనుంది. ఇ-బస్ ఆపరేటర్లలో విశ్వాసాన్ని పెంపొందించే సురక్షిత చెల్లింపు యంత్రాంగాన్ని అమలు చేయడం ద్వారా దీనిని సులభతరం చేయనున్నారు. ఈ చొరవ ప్రజా రవాణా నెట్‌వర్క్‌ను , పర్యావరణ అనుకూల, ఇంధన సామర్థ్య పద్ధతిలో ప్రయాణించడాన్ని బలోపేతం చేస్తుందని అంచనా.

2070 నాటికి దేశాన్ని కర్బన తటస్థం చేయాలన్న దార్శనికతను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అనుసరిస్తుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని, శుద్ధమైన, పర్యావరణ అనుకూల వాహనాలను దేశంలో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. భారీ పరిశ్రమలు మంత్రిత్వ శాఖ ఉ ఆటోమొబైల్ పరిశ్రమ ఈ దిశలో తమ పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉన్నారు.

ఈ సానుకూల చర్య ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమ స్థిరమైన వృద్ధికి బలమైన పునాదిని నిర్మించడం పై దృష్టి సారించి, శుద్ధమైన, పర్యావరణ అనుకూల భవిష్యత్తును పెంపొందించడంలో ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

# 50 రోజుల్లోనే అసంతృప్తి..ఇదే రేవంత్ ఘనత - కెటిఆర్

-ఆడబిడ్డలకు సాయం అటకెక్కిందా!
-అప్పుడే ప్రభుత్వంపై వ్యతిరేకత
-50 రోజుల్లోనే జనాల్లో అసంతృప్తి
-మహిళల మధ్య కొట్లాటలు
-ఆటోలు తగలెడుతున్న డ్రైవర్లు
-420 హామీలపై స్పందించని కాంగ్రెస్..
-మూడు అడుగులు లేని వ్యక్తి అంటూ సీరియస్..
-కేసీఆర్‌పై వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్..
మేడ్చల్ అసెంబ్లీ నేతలతో సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 2:ఆడోళ్ల మధ్య పోట్లాటలు.. డ్రైవర్ల అకలి కేకలు.. రుణ మాఫీకి చెల్లు చీటి.. అటకెక్కిన ఆడబిడ్డల సాయం పథకం.. ఇదే 50 రోజుల్లో రేవంత్ రెడ్డి సర్కార్ సాధించిన ప్రగతి అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దుయ్యబట్టారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజవర్గ పార్టీ నేతలు, కార్యకర్తలతో శుక్రవారం ఘట్‌కేసర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారుపై విరుచుకుపడ్డారు. 420 హామీలు ఇచ్చి కాంగ్రెస్ ఎన్నికల్లో గెలిచిందన్నారు. డిసెంబర్ 9న రూ. 2లక్షల రుణమాఫీ చేస్తానని రేవంత్ రెడ్డి అన్నారని, రెండు నెలలు గడుస్తున్నా రైతుల రుణమాఫీ జరగలేదన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పారు. ఉచిత బస్సుల వల్ల పరిస్థితి ఎలా తయారైందో అందరికీ తెలిసిందే అన్నారు. మహిళలకు ఉచిత బస్సు వల్ల ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారన్నారు. సీట్లు దొరక్క ఆడ బిడ్డలు, ఎక్క లేక మగవాళ్లు ఆగం అవుతున్నారని కెటిఆర్ ధ్వజమెత్తారు.

కడుపుమండి ఆటోలను తగలేస్తున్నరు..

హామీలు అమలు చేయలేక సీఎం రేవంత్ చేతులెత్తేశారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఆటోడ్రైవర్లు కడుపుమండి ఆటోలు తగల బెట్టే పరిస్థితి వచ్చిందన్నారు. కృష్ణా జలాల్లో మా వాటా ఎంత అంటే తేల్చలేదన్నారు. మన వాటా తేల్చకుండానే కేఆర్ఎంబీకి అంతా అప్పగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ప్రయోజనాలను కాంగ్రెస్ కేంద్రానికి తాకట్టు పెట్టిందన్నారు. అందుకే జాతీయ పార్టీలను నిలదీయాలంటే బీఆర్ఎస్ ఉండాలన్నారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలంటే బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలన్నారు.




కేంద్రంలోని బీజేపీకి చెక్ పెట్టాలన్నారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను వంద అడుగుల లోతులో బొందపెడతామన్న రేవంత్ వ్యాఖ్యలపై కేటీఆర్ అంతే స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. మూడు అడుగులు లేని రేవంత్ తెలంగాణ విధాత కేసీఆర్‌ను ఎలా బొంద పెడతారని ప్రశ్నించారు. ఈ బుడే ఖాన్ మాటలు, ఊక దంపుడు ఉపన్యాసాలు ఎవరూ నమ్మరని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ గురించి ఆలోచించడం మాని ఇచ్చిన వాగ్దానాల అమలుపై దృష్టి పెట్టాలని సలహా ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లోనే ఇంత వ్యతిరేకత మూటగట్టుకున్న చరిత్ర రేవంత్ దే నని అన్నారు.

# పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహిస్తున్నాం...

## - ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాలీబాల్, క్రికెట్ కిట్లను అందించాం
## - పీఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో తుంబూరు దయాకర్ రెడ్డి



ఖమ్మం, ఫిబ్రవరి 2:(నేటినిజం ప్రతినిధి): గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభ వెలికితీసేందుకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా క్రీడాకారులను ప్రోత్సాహించడం జరుగుతుందని, ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని గ్రామీణ క్రీడాకారులకు వాలీబాల్, క్రికెట్ కిట్లను అందించడం జరిగిందని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని కరుణగిరిలో పీఎస్ఆర్ యూత్ నాయకుడు ఏనుగు మహేష్ ఆధ్వర్యంలో పీఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ పేరిట పాలేరు నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను దయాకర్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడాలపై మక్కువ, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మీద అభిమానంతో క్రీడలను ప్రోత్సాహించాలనే సద్దుదేశ్యంతో పోటీలకు శ్రీకారం చుట్టిన ఏనుగు మహేష్ ను ప్రత్యేకంగా అభినందించారు. పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా భవిష్యత్తులోనూ క్రీడాకారులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి పొంగులేటి కూడా తనవంతు క్రీడాకారులకు సహాయ సహకారాలను అందిస్తారని తెలిపారు. పోటీలో పాల్గొన్న క్రీడాకారులందరూ క్రీడాస్ఫూర్తి చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీ వై ఎన్ ఓ తుంబూరు సునీల్ రెడ్డి, ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు కూరపాటి ప్రదీప్ కుమార్ తదితరులున్నారు.

# పశుసంవర్థక మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి పొడిగింపునకు మంత్రివర్గం ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:2025-26 వరకు మరో మూడేళ్లపాటు రూ.29 ,610.25 కోట్లతో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఐ డీ ఎఫ్) కింద అమలు చేయనున్న పశుసంవర్థక మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (ఏ హెచ్ ఐ డీ ఎఫ్) కొనసాగింపునకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం పాల ప్రాసెసింగ్ మరియు పాల ఉత్పత్తుల వైవిధ్యీకరణ, మాంసం ప్రాసెసింగ్ మరియు ఉత్పత్తుల వైవిధ్యం, పశు గ్రాసం ప్లాంట్, జాతుల అభివృద్ధి క్షేత్రం, జంతు వ్యర్థాల నుండి సంపద నిర్వహణ (వ్యర్థాల నిర్వహణ) మరియు పశు వ్యాక్సిన్ మరియు ఔషధ ఉత్పత్తి సౌకర్యాల కోసం పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది.

షెడ్యూల్డ్ బ్యాంక్ మరియు నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ సీ డీ సీ), నాబార్డ్ మరియు ఎన్ డీ డీ బీ నుండి 90% వరకు రుణం కోసం రెండు సంవత్సరాల మారటోరియంతో సహా 8 సంవత్సరాల పాటు 3% వడ్డీ రాయితీని భారత ప్రభుత్వం అందిస్తుంది. ఎంటిటీలు, వ్యక్తులు, ప్రైవేట్ కంపెనీలు, ఎఫ్ పీ ఓ, ఎం ఎస్ ఎం ఈ, సెక్షన్ 8 కంపెనీలు ఈ పథకానికి అర్హులు. డెయిరీ సహకార సంఘాలు కూడా డెయిరీ ప్లాంట్ల ఆధునీకరణ, బలోపేతం కోసం ప్రయోజనాలను పొందుతాయి.

రూ. 750 కోట్ల క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ నుండి తీసుకున్న రుణం లో 25% వరకు ఎం ఎస్ ఎం ఈ మరియు డెయిరీ కోఆపరేటివ్‌లకు భారత ప్రభుత్వం రుణ హామీని కూడా అందిస్తుంది.

ఏ హెచ్ ఐ డీ ఎఫ్ ఇప్పటివరకు 141.04 ఎల్ ఎల్ పి డి (రోజుకు లక్ష లీటర్లు) పాల ప్రాసెసింగ్ సామర్థ్యం, 79.24 లక్షల మెట్రిక్ టన్నుల దాణా ప్రాసెసింగ్ సామర్థ్యం మరియు 9.06 లక్షల మెట్రిక్ టన్ను మాంసం ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా ఈ పథకం సరఫరా వ్యవస్థ పై సానుకూల ప్రభావాన్ని సృష్టించింది. ఈ పథకం పాడి, మాంసం మరియు పశుగ్రాస రంగంలో ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని 2-4% పెంచగలిగింది.

పశుసంవర్థక రంగం పెట్టుబడిదారులకు పశుసంవర్థక రంగంలో పెట్టుబడి పెట్టడానికి అవకాశం కల్పిస్తుంది, విలువ జోడింపు, కోల్డ్ చైన్ మరియు డైరీ, మాంసం, పశుగ్రాస యూనిట్ల సమీకృత యూనిట్ల నుండి సాంకేతిక సహాయంతో పశువులు మరియు పౌల్ట్రీ ఫాంలు, జంతు వ్యర్థాల నుండి సంపద నిర్వహణ మరియు వెటర్నరీ డ్రగ్స్/వ్యాక్సిన్ యూనిట్ల ఏర్పాటువరకు ఈ రంగం లాభదాయకంగా మారుతుంది.

సాంకేతిక సహాయంతో జాతి అభివృద్ధి క్షేత్రాలు, పశువుల ఔషధాలు మరియు వ్యాక్సిన్ యూనిట్ల బలోపేతం, జంతు వ్యర్థాల నుండి సంపద నిర్వహణ వంటి కొత్త కార్యకలాపాలను చేర్చిన తర్వాత, ఈ పథకం పశుసంవర్థక రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి భారీ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తుంది.

ఈ పథకం వ్యవస్థాపకత అభివృద్ధి ద్వారా ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా 35 లక్షల మందికి ఉపాధి కల్పనకు మరియు పశుసంపద రంగంలో సంపద సృష్టిని లక్ష్యంగా చేసుకుంది. ఇప్పటివరకు, ఏ హెచ్ ఐ డీ ఎఫ్ ప్రత్యక్షంగా/పరోక్షంగా దాదాపు 15 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూర్చింది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, ప్రైవేట్ రంగ పెట్టుబడులను తీసుకురావడం ద్వారా పశుసంవర్ధక రంగం లో, ప్రాసెసింగ్ మరియు విలువ జోడింపులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకురావడం పశువుల ఉత్పత్తుల ఎగుమతిని ప్రోత్సహించడం మరియు దేశ ఆర్థిక వ్యవస్థకు దోహదపడడం వంటి వాటి ద్వారా ప్రధాన మంత్రి లక్ష్యాన్ని సాధించడానికి ఏ హెచ్ ఐ డీ ఎఫ్ ఒక మార్గంగా రూపొందుతోంది. అర్హత కలిగిన లబ్ధిదారులచే ప్రాసెసింగ్ మరియు విలువ జోడింపు మౌలిక సదుపాయాలపై ఇటువంటి పెట్టుబడులు ఈ ప్రాసెస్ చేయబడిన మరియు విలువ-ఆధారిత వస్తువుల ఎగుమతిని ప్రోత్సహిస్తాయి. అందువల్ల ఏ హెచ్ ఐ డీ ఎఫ్ ప్రోత్సాహకం ద్వారా పెట్టుబడి పెట్టడం వలన ప్రైవేట్ పెట్టుబడి 7 రెట్లు ప్రయోజనం పొందడమే కాకుండా ఇన్‌పుట్‌లపై ఎక్కువ పెట్టుబడి పెట్టేలా రైతులను ప్రోత్సహిస్తుంది, తద్వారా రైతుల ఆదాయం పెరుగుతుంది.

# అందరి సహకారంతో శ్రీకాకుళం నగరాభివృద్ధి -నూతన కమిషనర్ తమీమ్

శ్రీకాకుళం, ఫిబ్రవరి 2: అందరి సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేస్తామని శ్రీకాకుళం నగర కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తమీమ్ అన్సారియా అన్నారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఆమె కమిషనర్ గా బాధ్యతలు చేపట్టడంతో వలు విభాగాల అధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ఘన చరిత్ర కలిగిన ఈ నగరానికి ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని, ఇక్కడి ప్రజలకు మరింత మెరుగైన మౌలిక వసతులు, కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. నగరంలో మరింత మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ, పార్కింగ్ సౌకర్యాలు, ప్రజా మరుగుదొడ్లు, పట్టణ ప్రణాళిక విభాగం, మున్సిపల్ పార్కులు మెరుగుపరుస్తామని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా ఆమెకు స్వాగతం పలికిన వారిలో చీఫ్ ఇంజనీర్ పొగిరి సుగుణాకర రావు, మెప్మా పీడీ కిరణ్ కుమార్, ఉద్యానవన శాఖ ఏడి ప్రసాద్, పబ్లిక్ హెల్త్ డాక్టర్ వెంకటరావు, ఉమామహేశ్వరరావు, శివశంకర్ తదితరులు ఉన్నారు.

# భారతదేశానికి, యునైటెడ్ అరబ్‌ఎమిరేట్స్‌కు మధ్య ద్వైపాక్షిక పెట్టుబడి ఒడంబడికపై సంతకాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:భారత గణతంత్ర ప్రభుత్వాని కి మరియు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వాని కి మధ్య ఒక ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి మరియు ఆ యొక్క ఒప్పందాన్ని ధ్రువ పరచడాని కి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత న ఈ రోజు న సమావేశమైన కేంద్ర మంత్రిమండలి తన ఆమోదాన్ని తెలియ జేసింది

ఈ ఒడంబడిక ఇన్‌వెస్టర్ లలో, ప్రత్యేకించి పెద్ద ఇన్‌వెస్టర్ లలో విశ్వాసాన్ని మెరుగు పరచడం ద్వారా విదేశీ పెట్టుబడుల అవకాశాల తో పాటు గా ఓవర్‌సీస్ డైరెక్ట్ ఇన్‌వెస్ట్‌మెంట్ (ఒడిఐ) అవకాశాల ను కూడా అధికం చేయగలదని, అంతేకాక దీని ద్వారా ఉద్యోగ కల్పన పై సకారాత్మక ప్రభావం ప్రసరించవచ్చని ఆశించడమైంది.

ఆత్మనిర్భర్ భారత్ ను ఆవిష్కరించాలి అనేటటువంటి లక్ష్యాన్ని నెరవేర్చుకోవడం లో భాగం గా భారతదేశం లో పెట్టుబడులు అధికం కావడాని కి బాట ను పరచడం తో పాటుగా దేశీయంగా తయారీ ని ప్రోత్సహించడం, దిగుమతుల పై ఆధారపడడాన్ని తగ్గించడం, ఎగుమతుల ను వృద్ధి చెందింప చేయడం మొదలైన మార్గాల లో ఈ ఆమోదం సహాయకారి కాగలదన్న అంచనా ఉంది.

# యాటకల్లులో విషాదం.. అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య..

అమరావతి, ఫిబ్రవరి 2:ఒకే కుటుంబానికి చెందిన అక్కాచెల్లెళ్లు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శెట్టూరు మండలం యాటకల్లులో ఇవాళ చోటుచేసుకుంది. యాటకల్లుకి చెందిన జ్యోతి, రూప అక్కాచెల్లెళ్లు వారి ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారన్నారు. గ్రామంలో అందరితో కలిసి మెలిసి ఉన్న అక్కాచెల్లెళ్ళు ఒక్కసారిగా ఆత్మహత్యకు పాల్పడటంతో గ్రామంలో విషాదం నెలకొంది.

స్థానికులు తెలిపిన వివరాల మేరకు యాటకల్లు గ్రామానికి చెందిన చాకలి నారాయణస్వామికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య మృతిచెందడంతో రెండవ భార్య సరస్వతిని 22సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నారు. మొదటి భార్యకు కుమారుడు మనోజ్, రెండవ భార్య సరస్వతికి ఇద్దరు కుమార్తెలున్నారు. చాకలి రూప (18) చాకలి జ్యోతి (20)లు అనంతపురంలో ఒక కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు.

కొద్దిరోజుల క్రితం గ్రామానికి వచ్చిన అక్కాచెల్లెళ్లు రూప, జ్యోతిలు గ్రామంలోని స్వగృహంలోనే ఉండేవారు. బయటికి వెళ్లేవారు కాదు. ఇవాళ మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఇద్దరు అమ్మాయిలు మృతిచెందడంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రూ. 1.66 లక్షల కోట్లకు చేరిన సగటు నెలవారీ స్థూల జీఎస్టీ వసూలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: భారతదేశంలో ఛిన్నాభిన్నమైన పరోక్ష పన్ను విధానాన్ని ఏకీకృతం చేయడం ద్వారా జీఎస్‌టి వాణిజ్యం, పరిశ్రమలపై అనువర్తన భారాన్ని తగ్గించిందని గురువారం నాడు 2024-25 మధ్యంతర బడ్జెట్‌ను సమర్పిస్తూ కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఒక ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ ఇటీవల చేపట్టిన సర్వే ప్రకారం, 94శాతం అగ్రశ్రేణి పరిశ్రమల యజమానులు జీఎస్టీని సానుకూలమైదానిగా చూస్తున్నారని, ఇక 80శాతం రెస్పాండెంట్ల ప్రకారం అది సరఫరా లంకెను అనుకూలపరిచిందని అని ఆమె అన్నారు. అదే సమయంలో జీఎస్టీ పన్ను పునాది రెండింతలై, ఈ ఏడాది నెలవారీ స్థూల జీఎస్టీ వసూలు అన్నది రూ. 1.66 లక్షల కోట్లయిందన్నారు.

రాష్ట్రాలలో పెరిగిన ఆదాయం గురించి మాట్లాడుతూ, జీఎస్టీ అనంతర కాలంలో అంటే 2017-18 నుంచి 2022-23 వరకు రాష్ట్రాలకు విడుదల చేసిన పరిహారంతో సహా రాష్ట్రాల ఎస్‌జీఎస్‌టి ఆదాయం 1.22 మేరకు పుంజుకుందని ఆర్థిక మంత్రి తెలిపారు. ఇందుకు విరుద్ధంగా జీఎస్టీ ముందస్తు నాలుగేళ్ళ కాలం, అంటే, 2012-13 నుంచి 2015-16 వరకు పన్నుల ఉపసంహరణ రూపంలో రాష్ట్ర ఆదాయాల పన్ను పెరుగుదల కేవలం 0.72గా మాత్రమే ఉందన్నారు. లాజిస్టిక్స్ ఖర్చును, పన్నులను తగ్గించడం వల్ల అనేక వస్తువులు సేవల ధరలు తగ్గి, వినియోగదారులు అతిపెద్ద లబ్ధిదారులయ్యారని కేంద్ర ఆర్థిక మంత్రి నొక్కి చెప్పారు.

నేషనల్ టైమ్ రిలీజ్ అధ్యయనం నుంచి ప్రస్తావిస్తూ, గత నాలుగేళ్ళగా, అంటే 2019 నుంచి అంతర్జాతీయ వాణిజ్యాన్ని సులభతరం చేసేందుకు కస్టమ్స్ తీసుకున్న చర్యల ఫలితంగా ఇన్‌లాండ్ కంటైనర్ డిపోలలో సరుకు దిగుమతి చేసే సమయం 47 శాతం తగ్గి, 71 గంటలకు రాగా, ఎయిర్ కార్గో సముదాయాలలో 28 శాతం తగ్గి 44 గంటలకు, ఓడరేవుల వద్ద 27 శాతం తగ్గి 85 గంటలకు వచ్చిందని తెలిపారు.

# ప్రజలు తమ ఆకాంక్షలను నెరవేర్చుకునేందుకు అధిక వృద్ధితో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, ప్రభుత్వం కట్టుబడి ఉంది

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:ప్రజలు తమ ఆకాంక్షలను నెరవేర్చుకునేందుకు అధిక వృద్ధితో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, విస్తరించేందుకు తగిన పరిస్థితులను సృష్టించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. గురువారం పార్లమెంటులో మధ్యంతర కేంద్ర బడ్జెట్ 2024ను సమర్పిస్తూ కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ పై వ్యాఖ్యలు చేశారు.

కర్తవ్య కాల్‌గా అమృత కాల్

దీనిని కర్తవ్యకాల ప్రారంభంగా సంబోధిస్తూ, భారత గణతంత్ర 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధాన మంత్రి మోడీ దేశం అపారమైన సంభావ్యతలు, అవకాశాలకు ద్వారాలు తెరుస్తున్న సమయంలో కొత్త ప్రేరణలు, నూతన చైతన్యం, నవీన తీర్మానాలతో దేశ అభివృద్ధికి మేం కట్టుబడి ఉంటాం అన్న మాటలను శ్రీమతి సీతారామన్ ఉదహరించారు.

యువత వ్యవస్థాపక ఆకాంక్షలకు ద్వారాలు తెరవడం

ప్రధానమంత్రి ముద్రా యోజన కింద రూ. 22.5 లక్షల కోట్ల మొత్తంతో 43 కోట్ల రుణాలను కేటాయించి, యువతలోని వ్యవస్థాపక ఆకాంక్షలకు ద్వారా తెరిచామని కేంద్ర ఆర్థిక మంత్రి తెలిపారు. దీనితో పాటుగా, ఫండ్ ఆఫ్ ఫండ్స్, స్టార్టప్ ఇండియా, స్టార్టప్ రుణ హామీ పథకాలు యువతకు సహాయాన్ని అందిస్తుండగా, వారు కూడా రోజ్‌గార్ దాతలు (యజమానులు) అవుతున్నారు.

# ఆత్మకూరులో భువనేశ్వరి.. బాధిత కుటుంబాలకు పరామర్శ..

అమరావతి, ఫిబ్రవరి 2:టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' యాత్ర కొనసాగుతోంది. దీనిలో భాగంగా శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలోని అల్లిపురంలో నేడు ఆమె పర్యటించారు..టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్‌ను తట్టుకోలేక అల్లిపురంలో గుండెపోటుతో మృతిచెందిన తెదేపా కార్యకర్త కముజుల ఆంజనేయరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వెంకటగిరి నియోజకవర్గం, కలువాయి గ్రామంలో కార్యకర్త బొలిగర్ల చెన్నయ్య కుటుంబాన్ని కలుసుకున్నారు.. ఈ సందర్భంగా ఈ రెండు కుటుంబాలకు మూడు లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# ప్రభుత్వం మరింత సమగ్రమైన 'జిడిపి'పై దృష్టి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:"స్థూల దేశీయోత్పత్తి పరంగా అధిక వృద్ధిని అందించడమే కాకుండా, ప్రభుత్వం మరింత సమగ్రమైన 'జీడీపీ' అంటే 'పరిపాలన, అభివృద్ధి, పనితీరుపై సమానంగా దృష్టి సారించింది" అని కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ తెలిపారు. పార్లమెంట్‌లో ఆమె మధ్యంతర కేంద్ర బడ్జెట్ 2024ను ప్రవేశపెట్టారు. ప్రభుత్వం పారదర్శకంగా, జవాబుదారీగా, ప్రజాకేంద్రంగా, సత్వర విశ్వాస ఆధారిత పరిపాలనను 'పౌరుడే ప్రథమం' మరియు 'కనీస ప్రభుత్వం, గరిష్ఠ పాలన' విధానంతో అందించిందని కేంద్ర ఆర్థిక మంత్రి తెలిపారు. పెట్టుబడులు బలంగా ఉండటం వల్ల ఆర్థిక వ్యవస్థ బాగానే ఉందని, బాహ్య రంగంతో సహా స్థూల ఆర్థిక స్థిరత్వంతో పాటు, అన్ని రంగాల్లోనూ సర్వతోముఖాభివృద్ధి ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని సీతారామన్ అన్నారు.

ప్రజలు తమ ఆకాంక్షలను కొనసాగించడానికి సాధికారత పొందుతున్నారని, సన్నద్ధమవుతున్నారని అన్నారు. భవిష్యత్తులో మరింత గొప్ప ఆకాంక్షలతో ప్రజలు మెరుగ్గా జీవిస్తున్నట్లు, సంపాదన పెరుగడం ద్వారా ఇది కనిపిస్తుంది; ప్రజల సగటు నిజ ఆదాయం 50 శాతం పెరిగింది; ద్రవ్యోల్బణం మితంగా ఉంటుంది; కార్యక్రమాలు, పెద్ద ప్రాజెక్టుల సమర్థవంతంగా, సకాలంలో అమలులోకి వస్తున్నాయి.... అని నిర్మల సీతారామన్ తెలిపారు.

# అమృత్ పీఢి - యువత సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉంది : కేంద్ర ఆర్థిక మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఈ రోజు పార్లమెంటులో 2024-25 మధ్యంతర బడ్జెట్ ను ప్రవేశపెట్టిన సందర్భంగా అమృత్ పీఢి, యువశక్తిని శక్తివంతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

యువతను తగిన విధంగా సన్నద్ధం చేయడం, సాధికారత కల్పించడంపైనే మన శ్రేయస్సు ఆధారపడి ఉందని మంత్రి ఉద్ఘాటించారు. జాతీయ విద్యావిధానం 2020 పరివర్తనాత్మక సంస్కరణలకు నాంది పలుకుతోందని ఆమె పేర్కొన్నారు. పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం ఎస్ ఆర్ ఐ) నాణ్యమైన బోధనను అందిస్తోందని, సమగ్రమైన, మంచి వ్యక్తులను ప్రోత్సహిస్తోందని ఆమె అన్నారు.

స్కిల్ ఇండియా మిషన్ విజయాన్ని ప్రస్తావిస్తూ, మిషన్ కింద 1.4 కోట్ల మంది యువతకు శిక్షణ ఇచ్చామని, 54 లక్షల మంది యువతకు నైపుణ్యం కల్పించామని, 3000 కొత్త ఐటిఐలను ఏర్పాటు చేశామని శ్రీమతి సీతారామన్ తెలియజేశారు. ఇటీవల ప్రారంభించిన పీఎం విశ్వకర్మ యోజన ద్వారా 18 రకాల వర్తకాలలో నిమగ్నమైన చేతివృత్తుల వారికి ఎండ్ టు ఎండ్ సపోర్ట్ లభిస్తుందని ఆమె తెలిపారు.

# నేడు సిపిఎల్ఇఏ - కామన్‌వెల్త్ అటార్నీస్ ఎండ్ సలిసిటర్స్ జనరల్ కాన్ఫరెన్స్2024 ను ప్రారంభించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2024 ఫిబ్రవరి 3 వ తేదీ న ఉదయం పూట సుమారు 10 గంటల వేళ కు విజ్ఞాన్ భవన్ లో కామన్‌వెల్త్ లీగల్ ఎడ్యుకేశన్ అసోసియేశన్ (సిఎల్ఇఎ) - కామన్‌వెల్త్ అటార్నీస్ ఎండ్ సలిసిటర్స్ జనరల్ కాన్ఫరెన్స్ (సిఎఎస్‌జిసి) 2024 ను ప్రారంభించనున్నారు. ఈ సందర్భం లో హాజరు అయ్యే జనసమూహాన్ని ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తారు.

"న్యాయం అందజేత లో సరిహద్దుల కు ఆవలి వైపు నుండి ఎదురయ్యే సవాళ్ళు" అనేది ఈ సమావేశం యొక్క ఇతివృత్తం గా ఉంది. ఈ సమావేశం లో న్యాయ వ్యవస్థ లో పరివర్తన మరియు లీగల్ ప్రాక్టీసు యొక్క నైతిక పార్శ్వాలు; కార్యనిర్వహణ సంబంధి జవాబుదారుతనం తదితర విషయాల కు తోడు ఆధునిక కాలం లో న్యాయ విద్య పై పున: సమీక్ష ను చేపట్టడం వంటి చట్టం, న్యాయం లకు సంబంధించిన ముఖ్యమైన విషయాల ను చర్చించడం జరుగుతుంది.

ఈ సమావేశం లో వివిధ అంతర్జాతీయ ప్రతినిధి వర్గాల తో పాటు ఏశియా-పసిఫిక్, ఆఫ్రికా మరియు కేరేబియన్ లో విస్తరించినటువంటి కామన్‌వెల్త్ సభ్యత్వ దేశాల కు చెందిన అటార్నీ జనరల్స్, ఇంకా సలిసిటర్స్ కూడా పాలుపంచుకోనున్నారు. ఈ సమావేశం కామన్‌వెల్త్ దేశాల యొక్క చట్ట రంగం సంబంధి స్టేక్ హోల్డర్స్ మధ్య మాటామంతీ కి గాను ఒక విశిష్టమైనటువంటి వేదిక వలె పని చేయనుంది. ఈ సమావేశం లో న్యాయ విద్య మరియు అంతర్జాతీయం గా న్యాయాన్ని అందించడం లో ఎదురవుతున్న సవాళ్ళ ను పరిష్కరించడం కోసం ఒక విస్తృతమైనటువంటి మాంగ్రసూచీ ని అభివృద్ధి పరచాలన్న ఉద్దేశ్యం తో అటార్నీస్ మరియు సలిసిటర్స్ జనరల్ కోసం ఒక ప్రత్యేకమైన గుండ్రని బల్ల సమావేశాన్ని కూడా ను నిర్వహించడం జరుగుతుంది.

# ఒకటో తేది వెళ్లిపోయింది.. గ్రూప్ 1 నోటిఫికేషన్ ఏది .. రేవంత్ ను ప్రశ్నించిన కిషన్ రెడ్డి..

హైదరాబాద్, ఫిబ్రవరి 2: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హామీ ప్రకారం నిన్న ఫిబ్రవరి 1న గ్రూప్-1 నోటిఫికేషన్ రాకపోవడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు.. నోటీస్ విడుదల చేయకుండా ప్రజలను మోసం చేయడంలో ఘనమైన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ మరోసారి తెలంగాణ యువతను మోసం చేసిందని మండిపడ్డారు. బీజేపీ కేంద్ర కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నేడు పార్టీ రాష్ట్ర పదాధికారుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానంలో భాగంగా.. ఫిబ్రవరి 1వ తేదీన తెలంగాణ నిరుద్యోగ యువత కోసం కోసం గ్రూప్-1 నోటిఫికేషన్ వేస్తామని.. అట్టహాసంగా వార్తా పత్రికల మొదటి పేజీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చింది కదా అన్నారు. మరి నిన్ననే ఒకటో తేది.. ఇది ఫిబ్రవరి నెలే కదా అని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సమయం దాటిపోయిందని, మరి ఇంతవరకైతే నోటిఫికేషన్ రాలేదని కేంద్రమంత్రి గుర్తు చేశారన్నారు. నమ్మి ఓటేసిన తెలంగాణ యువతను నిట్టనిలువునా మోసం చేసిందన్నారు. యువతను మోసం చేసినట్లే.. ఇతర వాగ్దానాలనూ వ్యూహాత్మకంగా దాటవేసే ప్రయత్నం జరుగుతోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు..

# వైభవంగా శ్రీ జములమ్మ దేవత ప్రతిష్టాపన వేడుకలు.. పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 2: మక్తల్ పట్టణంలో ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ జమ్ములమ్మ దేవత విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు ఇవాళ అత్యంత వైభవంగా జరిగాయి. పట్టణంలోని శ్రీ మనసాని వెంకటేష్ గుప్తా సరళాదేవి, కిరణ్ ప్రత్యూష దంపతులు తమ తల్లి తండ్రి మనసాని నరసింహాయ్యగుప్త రత్నమ్మ జ్ఞాపకార్థం ఆలయ పునర్నిర్మాణం అమ్మారి విగ్రహ ప్రతిష్టాపన వేడుకలను నిర్వహించారు.

వేద పండితులు రాఘవేంద్ర ఆచార్య ,శ్యామ్ సుందర్ జోషి, శేషగిరి ,విజయేంద్ర చారి, వంశీకృష్ణ జోషి బృందం వేదమంత్రోశ్చరణల మధ్య అమ్మవారి ప్రతిష్టాపన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. అమ్మవారి విగ్రహంతో పాటు అమ్మవారి పాదుకలు ,బలిపీఠం ప్రతిష్టించారు. వేలాదిమంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ,సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి. నరసింహ గౌడ్ ,శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ చైర్మన్ కొత్త శ్రీనివాస్ గుప్తా వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. ప్రతిష్టాపన వేడుకల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

# హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు ఇక్కడా అదే గతి పడుతుంది : హరీశ్‌రావు



హైదరాబాద్, ఫిబ్రవరి 2: తెలంగాణకు శ్రీరామరక్ష బీఆర్ఎస్ పార్టీనే అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు వాటి స్వార్థం కోసమే పనిచేస్తాయని.. బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ ప్రయోజనాల కోసమే పోరాడుతుందని తెలిపారు. శుక్రవారం నిర్వహించిన భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ కారకర్తల సమావేశంలో హరీశ్ పాల్గొని ప్రసంగించారు.

కర్ణాటక కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరిస్తున్నారని.. అక్కడి 25 ఎంపీ సీట్లలో నాలుగైదు మాత్రమే వస్తాయని అంటున్నారని హరీశ్ రావు తెలిపారు. హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు ఇక్కడ కూడా అదే గతి పడుతుందని విమర్శించారు. మనం భయపడాల్సిన అవసరం లేదని.. భవిష్యత్తు తమదేనని బీఆర్ఎస్ కార్యకర్తలకు సూచించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సంక్షేమం కోసం పనిచేశామని.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ప్రజల కోసమే కొట్లాడదామని పిలుపునిచ్చారు. అధికార పక్షమైనా.. ప్రతిపక్షమైనా తాము ప్రజల పక్షమని స్పష్టం చేశారు.

ఓటమి శాశ్వతం కాదు. గెలుపుకు నాంది అని హరీశ్‌రావు తెలిపారు. ఇది స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని అన్నారు. ఎన్నికల హామీలను నిలబెట్టుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రచారంలో అబద్ధాలు మాట్లాడిన కాంగ్రెస్ పార్టీకి అధికారంలోకి వచ్చాక అసహనం పెరిగిందని విమర్శించారు. రైతుబంధు పడటం లేదని జడ్పీ చైర్మన్‌గా బాధ్యతతో సందీప్ రెడ్డి అడిగితే ఆయనను పోలీసులతో బయటికి పంపించారని మండిపడ్డారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి నల్గొండపై ప్రేమ ఉంటే సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడాలని సూచించారు.. రైతు బంధు పడటం లేదని ప్రశ్నిస్తే చెప్పుతో కొట్టాలనడం ఏం సంస్కారం అని నిలదీశారు. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులకు కేఆర్ఎంబీకి అప్పగించడం వల్ల నల్గొండకు తీవ్ర నష్టం జరుగుతుందని.. సాగునీళ్లు, తాగునీళ్లు ఉండవని అన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గురించి పచ్చి అబద్ధాలు చెప్పిందని హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్, బీజేపీల మధ్య సంబంధం ఉందని దుష్ప్రచారం చేసిందని ఆరోపించారు. బండి సంజయ్, రఘునందన్ రావు, ఈటల రాజేందర్‌లను ఓడించింది కాంగ్రెస్ కాదు, బీఆర్ఎస్సే అని స్పష్టం చేశారు. ఇప్పుడు కూడా ఎన్నికల హామీలను తప్పించుకోవడానికి అసలు అప్పును రెట్టింపు చేసి గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని అన్నారు.. నర్సింగ్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం.. కాంగ్రెస్ అపాయింట్‌మెంట్ మాత్రమే ఇచ్చింది. అని అన్నారు. ఫిబ్రవరి 1న గ్రూప్ 1 నోటిఫికేషన్ ఎందుకివ్వలేదో జవాబు చెప్పాలని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 2 లక్షల రైతు రుణమాఫీ ఎందుకు చేయలేదని నిలదీశారు. కార్యకర్తలందరూ కష్టపడాలని.. ఎంపీ సీటు మనదేనని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో కష్టపడి పోరాడి సత్తా చూపిద్దామని పిలుపునిచ్చారు.

వృద్ధులకు, వికలాంగులకు ఫించన్ 4 వేలకు పెంచలేదని.. 2వేల ఫింఛన్‌ను కూడా సమయానికి ఇవ్వడం లేదని అన్నారు. రైతుబంధు, పింఛన్, రుణమాఫీ, కరెంట్, ఉద్యోగాలు, వడ్లకు బోనస్.. అన్ని హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదన్నారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని.. కాంగ్రెస్ 420 హామీలపై గ్రామాల్లో, తండాల్లో చర్చకు పెట్టండని సూచించారు. దళిత బంధుకు మంజూరైన నిధులను కాంగ్రెస్ బ్యాంకుల్లో ఫ్రీజ్ చేసిందన్నారు. .

# కేంద్ర బడ్జెట్ తెలంగాణ పాలిట శాపంగా ఉంది

## - పదేళ్లలో మోదీ సర్కార్ వ్యవసాయాన్ని భ్రష్టు పట్టించింది

## -ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్

హైదరాబాద్ ఫిబ్రవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: కేంద్ర బడ్జెట్ తెలంగాణ పాలిట శాపంగా ఉందన్నారు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్. శుక్రవారం నాడు ఆయన గాంధీభవనలో మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ బీజేపీ నాయకులకు సిగ్గు, శరం లేదని.. బడ్జెట్‌లో అన్యాయం జరిగినా కేంద్రాన్ని ప్రశ్నించడం లేదని ధ్వజమెత్తారు. తెలంగాణ గడ్డపై అడుగుపెట్టే అర్హత మోదీ కోల్పోయారని విమర్శించారు. కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను నిరాశకు గురిచేసిందన్నారు. నిత్యవసర అంశాలపై రాయితీలను తగ్గించారని.. ఒక్క యునివర్సిటీకి కూడా బడ్జెట్ పెంచలేదని దుయ్యబట్టారు. విద్యారంగంలో కోతలు విధించారని.. నదుల అనుసంధానం లాంటి గొప్పగా చెప్పుకునే అంశాల్లో కూడా మోదీ కోతలు పెట్టారని సంపత్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.పదేళ్లలో మోదీ సర్కార్ వ్యవసాయాన్ని భ్రష్టు పట్టించిందని కనీసం ఇప్పుడైనా విభజన హామీలను మోదీ సర్కార్ నెరవేర్చలేదన్నారు. మూసీ నది ప్రక్షాళనపై సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి సమస్యను విన్నవించినా ప్రధాని మోదీ కనికరించలేదని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ దిగిపోతేనే విభజన హామీలు అమలవుతాయని తెలిపారు. తనకు ఎంత చేయాలో కాంగ్రెస్ అంత చేసిందని.. పార్టీకి తానే బాకీ ఉన్నానని అన్నారు. పార్టీ ఎక్కడి నుంచి ఆదేశిస్తే అక్కడి నుంచి పోటీ చేస్తానని స్పష్టం చేశారు. అధిష్ఠానం సర్పంచిగా పోటీ చేయమన్నా పోటీ చేస్తానని సంపత్ కుమార్ తెలిపారు.

# జనవరి నెలలో శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య ఎంతంటే..

తిరుపతి, ఫిబ్రవరి 2:తిరుమలలో వేంకటేశ్వర స్వామివారిని జనవరి నెలలో 21 లక్షల 9వేల మంది భక్తులు దర్శించుకున్నారని టీటీడీ ఈవో ధర్మారెడ్డి వెల్లడించారు. శుక్రవారం అన్నమయ్య భవన్ నుంచి నిర్వహించిన డయల్ యువర్ ఈవో ద్వారా భక్తులతో మాట్లాడారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 116.46 కోట్లు ఆదాయం వచ్చిందని వివరించారు. 1.03 కోట్లు లడ్డూలను విక్రయించామని, 46.46 లక్షల మంది భక్తులకు అన్న ప్రసాదం అందించామని పేర్కొన్నారు. 7.05 లక్షలు మంది కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారని తెలిపారు.

టీటీడీ ఆధ్వర్యంలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల, శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలకు అటానమస్ హోదా లభించిందని ఆయన వివరించారు. దీని వల్ల కళాశాలల అభివృద్ధికి స్వతహాగా నిర్ణయాలు తీసుకునే అవకాశంతోపాటు విద్యావిధానం, పరీక్షల నిర్వహణ, పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా సిలబస్‌లో మార్పులు చేసుకోవడం వీలవుతుందని అన్నారు. ప్రాంగణ ఎంపికలకు ప్రపంచ స్థాయి సంస్థలు ముందుకు వస్తాయని వెల్లడించారు .

# ధర్మం కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి నందరాజు గౌడ్

## - శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్



హైదరాబాద్ ఫిబ్రవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రజల కోసం ప్రాణాలను కూడా లెక్కచేయకుండా తదు శ్వాస వరకు పోరాడిన గొప్ప నాయకుడు స్వర్గీయ నందరాజు గౌడ్ అని శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సుదర్శన్ అన్నారు. అంబర్పేట్ అసెంబ్లీ నియోజకవర్గం సీ ఈ కాలనీ లో స్వర్గీయ నందరాజు గౌడ్ నందరాజు గౌడ్ 31 వ వర్ధంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు ఌ అర్పించారు. ధర్మం కోసం పాటు పడిన నందరాజు గౌడ్ కుటుం బానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అండగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమం లో శివసేన్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌట్ గణేష్ శివసేన్ నర్సింగ్ గౌడ్ మల్లేష్ కృష్ణ తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు

# పార్లమెంటు ఎన్నికల కోసం కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూంల పరిశీలన-జిల్లా కలెక్టర్ రాజర్షి షా

మెదక్, ఫిబ్రవరి 2: (నేటినిజం ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మెదక్ జిల్లాలో ఉన్న నర్సాపూర్ నియోజకవర్గం లో ఃఎఖీఎ ఇంజినీరింగ్ కళాశాల లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్,స్ట్రాంగ్ రూంలను శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచనలతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం ఃఎఖీఎ ఇంజనీరింగ్ కళాశాల లో కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూం లను పరిశీలించడం జరిగిందన్నారు.పార్లమెంట్ ఎన్నికల కోసం నర్సాపూర్ నియోజకవర్గం లో ఉన్న ఃఎఖీఎ కళాశాలలో 5 సెగ్మెంట్ లకు కౌంటింగ్ సెంటర్, ఒక పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ సెంటర్ ను ,ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల లో 2 సెగ్మెంట్ లకు కౌంటింగ్ సెంటర్ లను ఏర్పాటు దిశగా ఏర్పాట్లు చేస్తున్నామని , కౌంటింగ్ సెంటర్,స్ట్రాంగ్ రూంలలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు,నర్సాపూర్ ఆర్డీఓ శ్రీనివాసులు, తహశీల్దార్ కమలద్రి,ఃఎఖీఎ కళాశాల ప్రిన్సిపాల్ బాపిరాజు,ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల ప్రిన్సిపాల్ బిక్షవతి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అధికారం ఉందని రెచ్చిపోతే రాజకీయంలో కనుమరుగు అవుతారు : జగదీష్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 2: అధికారం ఉందని రెచ్చిపోతే రాజకీయంలో కనుమరుగు అవుతారని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .భువనగిరికి నాకు విడదీయలేని సంబంధం ఉందన్నారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఏం చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతున్నదని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు పెట్టి ప్రతిపక్షం అడిగిన ప్రశ్నలుకు సమాధానం చెప్పలేని పరిస్థితిలో కాంగ్రెస్ ఉందని ఎద్దేవా చేశబూరు. అసెంబ్లీలో బొక్కబోర్లా పడ్డారు.. రైతుబంధు అడిగితే చొప్పుతో కొట్టండని మంత్రి కోమటిరెడ్డి అహంకారపూరితంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. పని చేయడానికి ప్రజలు మీకు అధికారం ఇచ్చారు.

వెంకట్ రెడ్డి, రేవంత్ రెడ్డి గతంలో ఒకరు వైఎస్సార్, మరొకరు చంద్రబాబు బూట్లు తుడిచే వారని ఘాటుగా విమర్శించారు. మీరు ఇట్లనే మాట్లాడితే ప్రజలు మిమ్మల్ని బొంద్దపెడుతారని హెచ్చరించారు. ప్రజలు వచ్చే ఎన్నికలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీని గెలిపించాడనికి సిద్ధంగా ఉన్నారు. ఎవరు అధైర్య పడొద్దు అధికారం మనదేనని కార్యకర్తలకు భరోసానిచ్చారు.

# 10 వ తరగతిలో శత శాతం పలితాలు లక్ష్యంగా పెట్టుకోవాలి, విద్యార్థులకు ప్రేరణా ముఖ్యం

## - జిల్లా కలెక్టర్ రాజర్షి షా.

మెదక్, ఫిబ్రవరి 2: (నేటినిజం ప్రతినిధి):విద్యార్థులు భవిష్యత్ పై మంచి ప్రేరణా కల్గి ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా విద్యార్థులకు సూచించారు.స్థానిక మెదక్ పట్టణం లోని ఁఔఊా భవన్ లో ,శుక్రవారం 10 వ తరగతి ూఅ,ూహాస్టల్ విద్యార్థులకు,ూఅ,ూ అభివృద్ధి శాఖ మెదక్ ఆధ్వర్యంలో ప్రేరణా తరగతులు (ఎనీబితిలజీబితినీనిజీశ్రీ ఇశ్రీజీబబవబ) నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరైన, ప్రేరణా తరగతులను అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి,జ్యోతి ప్రజ్వలన తో కర్యక్రమన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ,10 వతరగతిలో విద్యార్థులు మంచి జీవితం కోసం ప్రేరణా కల్గి ఉండాలన్నారు

. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని,అనుభవమైన ఉపాధ్యాయులు తో పాటు అన్ని రకాల పుస్తకాలు , స్నాక్స్ అల్ ఇన్ వన్ లాంటి స్టడీ మెటీరియల్స్ ను, విద్యార్థులకు క్రమం తప్పకుండా అందిస్తున్నామన్నారు

హాస్టల్ లో ఉండే విద్యార్థుల కోసం, ప్రత్యేక స్టడీ హావర్స్ ,ప్రత్యేక టుటర్స్ లను నియమించి అనుభవం గల నిపుణులతో ప్రేరణా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు.జీవితం లో మంచి భవిష్యత్ కు పదవ తరగతి కీలకం అన్నారు.పదవతరగతి లో ఉన్న సబ్జెక్ట్ లను నిర్లక్ష్యం చేయొద్దని,పదవ తరగతి సబ్జెక్ట్ లు కేంద్ర ,రాష్ట్ర స్థాయి లో ఉండే సివిల్స్, గ్రూప్ 1,2,3 లాంటి పరీక్షలు ఉపయోగ పడతాయన్నారు. పరీక్షలు కొన్ని రోజులే సమయం ఉన్నందున సమయాన్ని వృదా చేయొద్దన్నరు.

టీవీ , ఫోన్ ,సోషల్ మీడియాలో లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ం.ః.అ.ఆ గ్రూప్ ల విద్యార్థులను విభజించాలమని , అ,ఆ గ్రూపు విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

పదవ తరగతి విద్యార్థులు సమన్వయము తో చదువుకోవాలన్నారు . హాస్టల్ లో విద్యార్థులను హాస్టల్ వార్డెన్ లు ,ఉదయం నిద్ర లేపి చదివించాలని, పరీక్షల సమయంలో లో విద్యార్థులను క్రమశిక్షణ గా ఉండేలా వార్డెన్ లు బాధ్యత తీసుకోవాలన్నారు. 10వ తరగతి లో శత శాతం పలితాలు లక్ష్యం గా విద్యార్థులు, ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ మెదక్ జిల్లా వ్యాప్తంగా ూఅ,ూ హాస్టల్ లలో 260 మంది విద్యార్థులు ఈ సం:రానికి పదవతరగతి లో పరీక్షలకు సిద్దంగా ఉన్నారని, విద్యార్థులు అన్ని సబ్జెక్ట్ లలో మంచి మార్కులు వచ్చేలా విషయ నిపుణుల తో ప్రేరణా తరగతులు నిర్వహిస్తున్నామని, ఉదయం ,సాయంత్రం స్నాక్ అందిస్తున్నామన్నారు. అంతకు ముందు వివిధ సబ్జెక్ట్ నిపుణులు విద్యార్థులకు ప్రేరణా తరగతులు బోధించారు.ఈ కార్యక్రమం లో ఁఔఊా జిల్లా అధ్యక్షుడు నరేందర్ ,ఁఔఊా జిల్లా కార్యదర్శి రవికుమార్, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు ,హాస్టల్ వార్డెన్ లు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్‌లో పర్యటించిన చీఫ్ సెక్రటరి శాంతికుమారి..



నిర్మల్, ఫిబ్రవరి 2 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి శుక్రవారం నిర్మల్ కు విచ్చేసిన సందర్భంగా ఫారెస్ట్ గెస్ట్ హౌస్ లో టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఉద్యోగులకు ఈనెల 1 తేదీన జీతాలు వచ్చినందుకు ఆమెకు థ్యాంక్స్ చెప్పారు.

ఉద్యోగుల పెండింగ్ బిల్స్, ఇతర సమస్యలు సి.ఎస్ కు వివరించారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారు. చీఫ్ సెక్రటరీని కలిసిన వారిలో అధ్యక్షులు వెల్మల ప్రభాకర్, కార్యదర్శి కుడాల రవికుమార్, ఉపాధ్యక్షులు జవాదు హుస్సేన్, నిర్మల్ టౌన్ కార్యదర్శి బి.శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ ఎస్.మోహన్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అరుణ్ పాల్గొన్నారు.

వచన కవితా సంపుటాలకు

ఆహ్వానము

"వెన్నెల సాహితీ పురస్కారం - 2023" కొరకు
2023 సం॥లో ప్రచురించిన వచన కవితా సంపుటాలు
నాలుగు (4) ప్రతులను ఈ క్రింది చిరునామాకు
29 ఫిబ్రవరి 2024 లోపు పంపగలరు.
సిద్దిపేటలో జరుగు సాహిత్య కార్యక్రమంలో నగదు పురస్కారం
అందజేయబడును.

: పుస్తకములు పంపవలసిన చిరునామా :
కొండి మల్లారెడ్డి
ఇ.నం. 19-61/5/సి, విద్యానగర్, రోడ్ నెం.3,
మిలన్ గార్డెన్ రోడ్, కుశాల్‌నగర్, సిద్దిపేట - 502103.
సెల్ : 9652199182, 9299909516

పర్కపెల్లి యాదగిరి
ప్రధాన కార్యదర్శి
వెన్నెల సాహితీ సంగమం, సిద్దిపేట.

# ఫిష్ ఫ్రై సెంటర్ మాటున కల్తీ దందా

- కల్లు లైసెన్స్ ఒకచోట దందా మరొకచోట
- సమాచారమిచ్చిన స్పందించని ఎక్సైజ్ సీఐ..?
- భారీగా ముడుపులు అందాయని ఆరోపణలు?
- తెర వెనుక మాజీ ప్రజాప్రతినిధి

ఖమ్మం, ఫిబ్రవరి 2:(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నడి ఒడ్డున విశ్వాస్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఫిష్ ఫ్రై సెంటర్లో జోరుగా కల్తీ కల్లు,బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారు. గత నాలుగు ఐదు రోజుల క్రితం ఒక దిన పత్రికలో కల్తీ కల్లు పై వార్త రావడంతో పోలీస్ బాస్ చొరవ తీసుకొని కల్లు తయారీ



కేంద్రంపై కేసు నమోదు చేసి సీజ్ చేశారు. పలు పత్రికల్లో వచ్చిన కథనాలపై కూడా ఎక్సైజ్ శాఖలో కదలిక లేకపోవడం పట్ల పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఫోను ద్వారా వాట్సాప్ ద్వారా సమాచారం ఇచ్చినా కూడా ఎక్సైజ్ సీఐ పట్టించుకోకపోవడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తెర వెనుక ఓ మాజీ ప్రతినిధి ఉండటంతో ఎక్సైజ్ అధికారులు జంకుతున్నారన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. షాపు యజమాని ఎక్సైజ్ శాఖ నుండి ఒక ఇంటి నెంబర్ పై లైసెన్సు పొందిన ఇంటిలో దుకాణం నిర్వహించాల్సి ఉండగా మరొకచోట అనగా ఫిష్ ఫ్రై సెంటర్లో దుకాణం నిర్వహిస్తున్నాడు. నడి రోడ్డుపై ఈ గలీజు దందా రాత్రి 12 గంటల వరకు నిర్వహించడం వలన మందు బాబులు పండగ చేసుకుంటున్నారు. మందుబాబుల వలన హాస్పిటల్ కి వచ్చే రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి యజమానిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు. ఈ కల్లు కొట్టు యజమాని వెనుక మాజీ ప్రజా ప్రతినిధి హస్తం ఉండడంతో అధికారులు సైతం వెనుకడుగు వేస్తున్నారని సమాచారం

# స్కేటింగ్ క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల : జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్కేటింగ్ క్రీడాకారులను జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అభినందించారు. జగిత్యాల పట్టణానికి చెందిన అద్వైత్, అభినవ్ సాయి, ప్రీతం స్పీడ్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ స్థాయి స్పీడ్ స్కేటింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్, బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా వారు సంజయ్ కుమార్‌ను ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వారిని ఎమ్మెల్యే సత్కరించి అభినందనలు తెలిపారు.

# బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ సంస్థకు చెందిన పలు ప్రాజెక్టులను ప్రారంభించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:మల్టీ-మోడల్ కనెక్టివిటీని అందించడానికి, సామర్థ్యాన్ని మరింతగా పెంపొందించడం ద్వారా లాజిస్టిక్స్ వ్యయాన్ని తగ్గించడానికి పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ సూత్రాలకు అనుగుణంగా.. బొగ్గు మంత్రిత్వ శాఖ మరింత సమర్థవంతమైన బొగ్గు తరలింపును వేగవంతం చేయడానికి పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల పెంపుదలని చేపట్టింది. బొగ్గు ఉత్పత్తి ప్రాంతాలలో రైల్వే నెట్‌వర్క్‌ను పెంపొందించే లక్ష్యంతో సీఐఎల్, ఇర్కాన్, మరియు ఒడిశా ప్రభుత్వం యొక్క సంయుక్త వెంచర్గా "మహానది కోల్ రైల్ లిమిటెడ్" ఏర్పాటు చేశారు. అదనపు రైలు మార్గాలను ఏర్పాటు చేయడం, ఇప్పటికే ఉన్న రైలు మార్గాలను రెట్టింపు చేయడం, రైల్-ఓవర్-రైల్ (ఆర్ఓఆర్), వై-కర్వ్‌ల నిర్మాణం మొదలైన వాటి కోసం సీఐఎల్ కీలకమైన రైలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నిధులు సమకూర్చింది. అనుబంధ సంస్థలలో, మొదటి మైల్ కనెక్టివిటీ (ఎఫ్ఎంసీ) ప్రాజెక్ట్‌ల నిర్మాణం ద్వారా పిట్-హెడ్ నుండి రైల్వే లోడింగ్ పాయింట్ వరకు యాంత్రిక బొగ్గు రవాణా అవస్థాపనను ఏర్పాటు చేయాలని సీఐఎల్ యోచిస్తోంది. అన్ని పెద్ద గనుల కోసం మొత్తం 100 కంటే ఎక్కువ ఎఫ్ఎంసీ ప్రాజెక్టులు ప్రణాళిక చేయబడ్డాయి. ఈ ప్రాజెక్టులు ఒకవైపు లోడింగ్ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయి. లోడింగ్ సమయాన్ని తగ్గిస్తాయి. మరోవైపు ఉద్గారాలు మరియు కాలుష్యాన్ని తగ్గించడంలో దోహదం చేస్తాయి. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 3 ఫిబ్రవరి 2024న ఒడిశాలో మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎంసీఎల్) యొక్క కీలక ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. వీటిలో భువనేశ్వరి ఫేజ్-1, అంగుల్ జిల్లాలోని తాల్చెర్ కోల్‌ఫీల్డ్స్‌లో 335 కోట్ల రూపాయలతో నిర్మించిన ఫస్ట్ మైల్ కనెక్టివిటీ (ఎఫ్ఎంసీ) ప్రాజెక్ట్, రేక్ లోడింగ్ సమయాన్ని సుమారు 50 నిమిషాలకు తగ్గిస్తుంది. పర్యావరణ అనుకూల రవాణాను పరిచయం చేస్తుంది. గ్రీన్‌హౌస్‌ను తగ్గిస్తుంది. గ్యాస్ ఉద్గారాలు, మరియు బొగ్గు రవాణా ఖర్చులను తగ్గించగలదు. మరో ముఖ్యమైన ప్రాజెక్ట్ లజ్కురా రాపిడ్ లోడింగ్ సిస్టమ్ (ఆర్ఎల్ఎస్), సుమారు రూ. 375 కోట్ల పెట్టుబడితో నిర్మించబడింది.. ఈ వ్యవస్థ బొగ్గు నాణ్యత మరియు సరఫరాను మెరుగుపరచడానికి, దాదాపు 50 నిమిషాల లోడింగ్ సమయాన్ని సాధించడానికి, పర్యావరణ అనుకూల రవాణాను స్వీకరించడానికి, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి మరియు మొత్తం బొగ్గు రవాణా ఖర్చులను తగ్గించడానికి రూపొందించబడింది. ఈ ప్రయత్నాలు పర్యావరణ ప్రభావాన్ని గణనీయంగా తగ్గించడమే కాకుండా స్థానిక యువతకు విలువైన ఉపాధి అవకాశాలను కూడా సృష్టిస్తాయి. ఈ మైలురాయి ప్రాజెక్టులతో పాటు ఒడిశాలోని జార్సుగూడ జిల్లాలో రూ.550 కోట్ల వ్యయంతో నిర్మించిన ఐబీ వ్యాలీ వాషరీని కూడా ప్రధాని ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్ట్ నాణ్యత కోసం బొగ్గు ప్రాసెసింగ్‌లో ఒక నమూనా మార్పును సూచిస్తుంది, ఇది ఆవిష్కరణ మరియు స్థిరత్వాన్ని నొక్కిచెప్తుంది, బొగ్గు నాణ్యత ప్రమాణాల కోసం బార్‌ను పెంచుతుంది మరియు స్వచ్ఛమైన మరియు మరింత సమర్థవంతమైన ఇంధన పరిష్కారాల కోసం భారతదేశం యొక్క దృష్టికి అనుగుణంగా ఉంటుంది. దీనికి తోడు రూ. 878 కోట్ల పెట్టుబడితో మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎంసీఎల్) నిర్మించిన జార్సుగూడ-బర్పాలి-సర్దేగా రైలు మార్గం ఫేజ్-1 యొక్క 50 కి.మీ పొడవైన రెండవ ట్రాక్‌ను ప్రధాని జాతికి అంకితం చేయనున్నారు. ఈ విస్తరణ రైలు మౌలిక సదుపాయాలను గణనీయంగా పెంపొందించడానికి, అతుకులు లేని రవాణాను సులభతరం చేయడానికి మరియు సమర్థవంతమైన బొగ్గు సరఫరా గొలుసులను నిర్ధారించడానికి సిద్ధంగా ఉంది. మొత్తం పెట్టుబడితో కలుపుకొని దాదాపు రూ.2145 కోట్లు, స్థిరమైన మరియు సమర్థవంతమైన ఇంధన సరఫరా కోసం బొగ్గు మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో ప్రభుత్వ నిబద్ధతను ఈ ప్రయత్నాలు నొక్కి చెబుతున్నాయి. ఈ ప్రాజెక్టులు ఒడిశాలోని బొగ్గు పరిశ్రమకు గణనీయమైన ప్రయోజనాలను తెస్తాయని మరియు దేశ ఇంధన భద్రతకు దోహదపడుతుందని భావిస్తున్నారు.

# హుస్సేన్ సాగర్ వరద కాలువ ఆక్రమణలపై దృష్టి సారించాలి

- మూసి రివర్ ఫ్రంట్ కార్యక్రమానికి అనుబంధంగా అభివృద్ధి చేయాలి
-ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ డిమాండ్

హైదరాబాద్ ఫిబ్రవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మూసి రివర్ ఫ్రంట్ సుందరీకరణపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో హుస్సేన్ వరద కాలువను కూడా అదే తరహాలో అభివృద్ధి చేయాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ వరద కాలువ ఆక్రమణల కారణంగా గతంలో పలుమార్లు వర్షాలకు లోతట్టు ప్రాంతాలు మునిగి పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని కౌన్సిల్ అధ్యక్షులు ఎస్పీ హెచ్ రంగయ్య శుక్రవారం బాగ్ లింగం పల్లిలో విలేకరులకు వివరించారు. నాలా వెంట బఫర్ జోన్ పెద్ద ఎత్తున ఆక్రమణలకు గురైందన్న విమర్శలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం మూసి సుందరీకరణకు అనుబంధంగా ఈ సాగర్ వరద కాలువను కూడా ఆధునీకరించాలని కోరారు. ఆక్రమణలు తొలగించి బాలలకు ఆటస్థలాలుగా మార్చడంతోపాటు అరుదైన మొక్కలతో ఉద్యానవనాలు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కిలోమీటర్ల మేర ఉన్న ఈ వరద నాలా ఆధునీకరణ ఈ ప్రాంతానికి కొత్త అందాలు పంచుతుందని రంగయ్య పేర్కొన్నారు.

# సముద్రపు దొంగలు హైజాక్ చేస్తున్న నౌకలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:గత మూడేళ్ళలో సముద్రపు దొంగలు ఏడు నౌకలను సముద్రంలోనే హైజాక్ చేసిన ఘటనలు నమోదయ్యాయి. వాణిజ్య నౌక - లైలా నార్ఫోక్ హైజాక్ ఘటన ఇందులో ఒకటి. జనవరి 04-05, 2024న చోటు చేసుకున్న ఈ నౌకలో 15మంది భారతీయులు సహా మొత్తం 21మంది సిబ్బంది ఉన్నారు. తర్వాత, చేపలు పట్టే నౌక - ఇమాన్ (ఎఓంఔ)ను జనవరి 28, 2024న ఉ మరొక చేపలు పట్టే మరొక నౌక అల్ నిమీ (ఎం ఔజీవవఎతి)ని జనవరి 29, 2024న హైజాక్ చేసిన ఘటనలు చోటు చేసుకున్నాయి. కాగా, వీటిలో భారతీయ సిబ్బంది లేరు.

భారత నావికాదళం సముద్ర భద్రతను ప్రోత్సహించడానికి ప్రాంతీయ, అదనపు ప్రాంతీయ నావికాదళాలు/ సముద్ర బలగాలతో క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. 2008 నుంచి భారతీయ నావికాదళం గల్ఫ్ ఆఫ్ ఈడెన్, ఆఫ్రికాలోని తూర్పు తీరంలో సముద్ర దొంగతనాలను నిలువరించేందుకు గస్తీ కోసం యూనిట్లను మోహరించింది. ఇప్పటివరకూ 3,440 నౌకలు, 25వేల మందికి పైగా నావికులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చింది. ఈ ప్రాంతంలో సముద్ర తీర భద్రతను పునరుద్దరించేందుకు, నౌకల ఉనికిని పెంచడం, సముద్ర గస్తీ విమానం ద్వారా నిఘా/ మధ్య అరేబియా సముద్రంలోనూ, సోమాలియా తూర్పు తీరంలో రిమోట్‌గా పైలెట్ చేసిన విమానాలను భారత నావికాదళం చేపట్టింది. అరేబియా సముద్రంలో ఉ గల్ఫ్ ఆఫ్ ఈడెన్ / పొరుగు ప్రాంతాలలో తిరుగుతున్న వాణిజ్య నౌకలలో భారతీయ సిబ్బంది గురించిన వివరాల కోసం డిజి (షిప్పింగ్)తో, జాతీయ, అంతర్జాతీయ సముద్ర భద్రతా ఏజెన్సీలతో సమన్వయపూరిత రీతిలో తక్షణ స్పందన, సమర్ధవంతమైన అనుసంధానం, సహకారం కోసం సమాచార మార్పిడి. దీనికి అదనంగా, ఈ ప్రాంతంలో సముద్ర భద్రత కోసం ఈ ప్రదేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న చేపలు పట్టే నౌకలు / పడవలను భారతీయ నావికాదళం ప్రశ్నిస్తోంది.

ఈ ప్రాంతంలో సముద్ర భద్రతను పునరుద్దరించే దిశగా మధ్య అరేబియా సముద్రంలో, సొమాలియా తీరానికి తూర్పున నౌకల ఉనికిని, సముద్ర గస్తీ విమానం / రిమోట్ పైలట్ చేసిన విమానాల ద్వారా వైమానిక నిఘాను భారతీయ నావికాదళం పెంచి, మెరుగుపరిచింది. పాక్ స్ట్రైట్‌లో ఎటువంటి సముద్రపు దొంగతనాలకు సంబంధించిన ఘటనలూ నమోదు కాలేదు.

లోక్‌సభలో శ్రీ ఎ. గణేశమూర్తి అడిగిన ప్రశ్నకి లిఖితపూర్వకంగా సమాధానం ఇస్తూ రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ అజయ్‌భట్ ఈ సమాచారాన్ని వెల్లడించారు.

# వాయుశక్తి-2024 విన్యాసాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:భారత వైమానిక దళం (ఐఎఫ్), ఈ నెల 17న, జైసల్మేర్ సమీపంలోని పోఖ్రాన్ వద్ద వాయుశక్తి-24 విన్యాసాలు నిర్వహించనుంది. గత విన్యాసాలు 2019 ఫిబ్రవరి 16న జరిగాయి.

ఎప్పటిలాగే, వాయుశక్తి విన్యాసాలను పగటి సమయంతో పాటు రాత్రి సమయంలోనూ చేపడతారు. వైమానిక దళం వీరత్వం, రక్షణ సామర్థ్యాలను అవి ప్రపంచానికి చాటి చెబుతాయి. భారత సైన్యం కూడా ఈ విన్యాసాల్లో పాల్గొంటుంది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొంది ంచిన తేజస్, ప్రచండ్, ధ్రువ్ సహా 121 విమానాలు ఈ సంవత్సరం వాయుశక్తిలో పాల్గొంటా యి. రాఫెల్, మిరాజ్ -2000, సుఖోయ్-30, జాగ్వార్, హాక్, సి-130జే, చినూక్, అపాచీ, ఎంఐ-17 కూడా ఈ జాబితాలో ఉన్నాయి. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన భూమి నుంచి ఆకాశంలోకి ప్రయోగించే ఆయుధ వ్యవస్థలు ఆకాశ్, సమర్ కూడా విన్యాసాల్లో పాలుపంచుకుంటాయి, చొరబాటు విమానాన్ని కనిపెట్టి కూల్చివేయగల సత్తాను అవి ప్రదర్శిస్తాయి. సంప్రదాయ ఆయుధాలను కూడా ఖచ్చితత్వంతో, సరైన సమయంలో, విధ్వంసక ప్రభావంతో ప్రయోగించగల ఐఏఎఫ్ సామర్థ్యాన్ని వాయుశక్తి చాటుతుంది. గరుడలతో కూడిన ఐఏఎఫ్ రవాణా, హెలికాప్టర్లు, భారత సైన్యంతో కలిసి ప్రత్యేక విన్యాసాలు ప్రదర్శిస్తాయి.

# మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మత్తులు త్వరగా పూర్తిచెయ్యాలి:వైరాఆత్మకమిటీ చైర్మన్



ఖమ్మం, ఫిబ్రవరి 2:(నేటినిజం ప్రతినిధి): మిషన్ భగీరథ ఐదు మండలాలకు వెళ్ళు మెయిన్ లైన్ బస్వాపురం రైతు వేదిక ఎదురుగా రెండు రోజుల క్రితం లీక్ అవ్వడం జరిగింది, కొనిజర్ల మండల ప్రజలకు తాగునీటికి ఇబ్బంది కలుగుతుందని మిషన్ భగీరథ ఎల్అండ్ టి అధికారు లతో మాట్లాడి మరమ్మతు పనులు త్వరగా పూర్తిచేసి ఐదు మండలాల ప్రజలకు త్రాగునీరు అందివ్వాలని కోరిన వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, ఈ కార్యక్రమంలో కొనిజర్ల ఏఈ కృష్ణ చైతన్య, సూపర్వైజర్ శ్రీనివాస్, మిషన్ భగీరథ వర్కర్లు పెరిక ఉపేందర్, చల్లా నరేష్, సాయిబాబా, రమేష్, శ్రీనివాస్, జోగారావు, రాంబాబు, తదితరులున్నారు.

# అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిపించాలి

-సకాలంలో చార్జ్ షీట్ దాఖలు చేయాలి.
-జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి.

సంగారెడ్డి, ఫిబ్రవరి 2 (నేటి నిజం ప్రతినిది) ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులకు సూచించారు.

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది.

ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ రూపేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అట్రాసిటీ కేసుల పురోగతి పై డివిజన్ ల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి నిర్ణీత గడువులోపు చార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. బాధితులకు సత్వర న్యాయం జరగాలన్నారు.

పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ముందు కెళ్లాలని సూచించారు.

బాధితులకు ప్రభుత్వం తరపున అందించాల్సిన ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందేవిధంగా చూడాలన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారం పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీ కమ్యూనిటీ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విజిలెన్స్ కమిటీ సభ్యులు క్రియాశీలక పాత్ర పోషించాలని,ఎస్సీ ఎస్టీ జనాభా ఎక్కువగా ఉన్న చోట ప్రభుత్వ సంక్షేమ పథకాలు అక్కడ పూర్తిస్థాయిలో అమలయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా విద్యారంగానికి ఎక్కువ ప్రాధాన్యత నివ్వాలని, పిల్లలను చదివించేలా, ఆదిశగా కృషి చేయాలని కమిటీ సభ్యులను కోరారు.

క్షేత్ర స్థాయిలో అట్రాసిటీ అంశాలతో ముడిపడి ఉన్న సంఘటనల గురించి ఎప్పటికప్పుడు తమ దృష్టికి తేవాలని సూచించారు.

జిల్లా ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకున్నప్పుడు పోలీస్ శాఖ తరపున బాధితులకు తప్పనిసరిగా పూర్తి న్యాయం జరిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పెండెన్సీ కేసులన్నింటి పై ఎప్పటికప్పుడు రివ్యూ చేస్తున్నామని తెలిపారు. ఆయా నిబంధనలు, చట్టాల ఉల్లంఘనలు, నేరాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని సభ్యులకు



సూచించారు. ప్రతినెల డివిజన్ స్థాయిలో నిర్వహించే క్రైమ్ మీటింగ్స్ లో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులను పిలుస్తారని తెలిపారు. అంతకుముందు కమిటీ సభ్యులు పలు సమస్యలను కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిడి అఖిలేష్ రెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారులు, డీఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులు, విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాథోడ్ నరసింహులు, కె. ఇమ్మయ్య, పి. దుర్గాప్రసాద్, ఎం. చంద్రశేఖర్, బి. రామకృష్ణ, ఎన్జీవో జి . వెంకటేశం, పాల్గొన్నారు

# ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ తలబిరా బొగ్గు విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:బొగ్గు రవాణా వ్యయాన్ని తగ్గించేందుకు పిట్‌హెడ్‌ల దగ్గరే బొగ్గు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పాలన్న ప్రధాన మంత్రి ఆశయానికి అనుగుణంగా, బొగ్గు మంత్రిత్వ శాఖ, బొగ్గు సీపీఎస్‌యూల ద్వారా బొగ్గు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా, ఎన్ఐసీఐఎల్ ద్వారా తలబిరా వద్ద 3లీ800 మె.వా. అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంటు ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. 23 మి.ట. సామర్థ్యంతో, మొత్తం 553 మిలియన్ టన్నుల నిల్వలతో తలబిరా బొగ్గు గనులను కేటాయించింది. ఈ ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభమైతే, యూనిట్‌కు రూ.3.65 (సుమారు రూ. 2.40 స్థిర ధర ఉ రూ.1.25 అస్థిర ధర) ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. దేశంలోని టీపీపీలు ఉత్పత్తి చేసే చౌక విద్యుత్‌లో ఇది ఒకటిగా నిలుస్తుంది.

ఈ నెల 03న, ఒడిశాలోని సంబల్‌పూర్‌లో, ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్‌కు (ఎన్ఎల్‌సీఐఎల్) చెందిన 2,400 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంటుకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. రూ. 27,000 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టు, ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తిని కలిగి ఉంటుంది. అత్యాధునిక ఈ ప్రాజెక్టు నమ్మకంగా, తక్కువ ధరకు, నిరంతర విద్యుత్‌ను అందిస్తుంది. దేశం ఇంధన భద్రతకు ఇది తోడ్పడుతుంది, ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది.

ఈ పిట్‌హెడ్ విద్యుత్ కేంద్రం ఎన్ఎల్‌సీఐఎల్ సొంత బొగ్గు గనులైన తలాబిరా ఎఎ ఉ ఎఎఎకి అనుసంధానమై ఉంటుంది. ఇది, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంతో పాటు కర్బన ఉద్గారాలను తగ్గిస్తుంది.

ఒడిశాకు 800 మెగావాట్లు, తమిళనాడుకు 1,500 మెగావాట్లు, కేరళకు 400 మెగావాట్లు, పుదుచ్చేరికి 100 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు (పీపీఏ) ఇప్పటికే పూర్తయ్యాయి. రూ. 18,255 కోట్ల విలువైన ప్రధాన విద్యుత్ కేంద్రానికి సంబంధించి, 'ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ ఉ కన్‌స్ట్రక్షన్' (ఈపీసీ) కాంట్రాక్టును బీహెచ్ఈఎల్‌కు అప్పగించారు. మొదటి 800 మెగావాట్ల యూనిట్ 52 నెలల్లో ప్రారంభమవుతుందని భావిస్తున్నారు. మిగిలిన యూనిట్లు ఆరు నెలల వ్యవధిలో ప్రారంభమవుతాయి.

ఈ కీలక ప్రాజెక్టు భారతదేశ ఇంధన భద్రతను పటిష్టం చేయడంతో పాటు, పర్యావరణ అనుకూల ఇంధన పరిష్కారాలను స్వీకరించడంలో కీలక అడుగుగా మారుతుంది. హరిత భవిష్యత్ స్థాపనలో భారతదేశ నిబద్ధతను ఈ ప్రాజెక్టు చాటుతుంది.




# హైదరాబాద్‌లో జార్ఖండ్ ఎమ్మెల్యేలు.

హైదరాబాద్, ఫిబ్రవరి 2:జార్ఖండ్ కొత్త ముఖ్యమంత్రిగా చంపై సోరెన్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఈ నెల అయిదో తేదిన అక్కడ అసెంబ్లీలో బల పరీక్షను ఎదుర్కొనున్నారు.. ఈ నేపథ్యంలో ఎఎంఎం , కాంగ్రెస్ కు చెందిన 43 మంది ఎమ్మెల్యేలతో చంపై క్యాంప్ రాజకీయాలకు తెరతీశారు.. అధికార జెఎంఎం కూటమిలో కాంగ్రెస్ కూడా ఉండటంతో ఎమ్మెల్యేలను హైదరాబాద్ క తరలించారు.. ఎమ్మెల్యేలు బేగంపేట్ ఎయిర్ పోర్టులో దిగారు. రెండు ప్రత్యేక విమానాల్లో బేగంపేట్ కు చేరుకున్నారు. జార్ఖండ్ ఎమ్మెల్యేలు వీరికి తెలంగాణ కాంగ్రెస్ నేతలు, మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జీ దీపదాస్ మున్షీ స్వాగతం పలికారు.

అనంతరం జార్ఖండ్ ఎమ్మెల్యేలను బేంగపేట్ నుంచి శామీర్ పేట్ లోని రిసార్ట్స్ కు తరలించారు. శామీర్ పేట్ లోని లియోనియో హోటల్, గచ్చిబౌలిలోని ఎల్లా హోటల్లో జార్ఖండ్ ఎమ్మెల్యేలకు వసతి ఏర్పాటు చేశారు. కాగా, ఇక్కడకు వచ్చిన ఎమ్మెల్యేలు చేజారకుండా కాంగ్రెస్ పార్టీ భాద్యతలు తీసుకుంది. ఈ క్యాంప్ కు మంత్రి పొన్నం ప్రభాకర్, సంపత్ కుమార్ లకు కోఆర్డినేషన్ బాధ్యతలు అప్పగించారు.

మరోవైపు సిఎం గా ఉన్న హేమంత్ సోరెన్ ను ఈడీ అరెస్ట్ చేయడంతో ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు.. ఈ నేపథ్యంలో అధికార జేఎంఎం కూటమి శాసనసభా పక్ష నేత చంపై సోరేన్ జార్ఖండ్ కొత్త ముఖ్యమంత్రిగా శుక్రవారం (ఫిబ్రవరి 2) ప్రమాణ స్వీకారం చేశారు. రాంచీలోని రాజభవన్ లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ చంపైతో ప్రమాణం చేయించారు. చంపైతోపాటు పలువురు ఎమ్మెల్యేలు కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. మరోవైపు కొత్త ప్రభుత్వం బలనిరూపణకు 10 రోజుల గడువు ఇచ్చారు గవర్నర్ రాధాకృష్ణన్.. అప్పటివరకు ఎమ్మెల్యేలు హైదరాబాద్ లోనే బస చేయనున్నారు. కాగా 81 మంది సభ్యులున్న జార్ఖండ్ అసెంబ్లీలో కాంగ్రెస్,జెఎంఎం బలం 48 గా ఉంది.. బిజెపికి 33 సభ్యులున్నారు? చంపై ప్రభుత్వ బలపరీక్షలో నెగ్గాలంటే 42 మంది సభ్యుల బలం అవసరం?దీంతో ఎమ్మెల్యేలు ఏ ఒక్కరూ చేజారకుండా కాంగ్రెస్ చూస్తున్నది..

## రామన్నపేట పట్టణంలో పెద్దపులి కలకలం

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 2: యాదాద్రి భువనగిరిజిల్లా రామన్నపేట పట్టణకేంద్రంలో పులిసంచారం కలకలం సృష్టిస్తున్నది. రామన్నపేట పట్టణ కేంద్రంలోని మైలురాయి 45 వద్ద పులి రైలు పట్టాలు దాటుండగా రైల్వే గార్డు గమనించి స్థానిక రైల్వే స్టేషన్లో సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న స్థానిక సీఐ వెంకటేశ్వర్లు ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్నారు. అటవీ అధికారులు కూడా సమాచారం అందించారు. పులి సంచరిస్తున్నదనే సమాచారంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు వీలైనంత తొందరగా పులిని పట్టుకోవాలని కోరుతున్నారు.

## ఖమ్మం అర్బన్ సిఐను కలిసిన కాంగ్రెస్ నేతలు



ఖమ్మం, ఫిబ్రవరి 2:(నేటినిజం ప్రతినిధి): ఇటీవల జారీచేసిన సర్కిల్ ఇన్స్‌పెక్టర్ల బదిలీ ఉత్తర్వుల నేపథ్యంలో ఎస్ హెచ్ వో గా నూతనంగా భాద్యతలు స్వీకరించిన ఖమ్మం అర్బన్ ఖానాపురం హావేలి సిఐ భానుప్రకాష్ ను శుక్రవారం జిల్లా నాయకులు,14 డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బండి నాగేశ్వరరావు, కమతం రామకృష్ణ, ఓబీసీ జిల్లా సెక్రెటరీ బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, మంకిన లక్ష్మణ్, ఎస్ కే బడే సాబ్, తాళ్లూరి జ్యోతి మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

